వీరపునాయుని పల్లె మండలం ఉరుటూరులో వర్షం కురవక ఎండిపోతున్న మినుము పంటను దున్నేస్తున్న దృశ్యం



ఖరీఫ్ కష్టమే..!

- ఆదుకోని నైరుతి రుతుపవనాలు
- 403.3 మి.మీ. గాను 299.5 మి.మీ. మాత్రమే వర్షపాతం నమోదు
- 3,509 హెక్టార్లలో ఎండిన పంటలు
- 2,858 హెక్టార్లలో మినుము..
- 651 హెక్టార్లలో వేరుశనగ ఎండుముఖం
- పత్తి, కంది, కొర్ర, జొన్న పంటల పరిస్థితీ అంతంతే
- లబోదిబోమంటున్న రైతన్నలు

వర్షాధారంతో సాగైన పంటలు (హెక్టార్లలో)..

పంట	సాగులక్ష్యం	సాగైంది
వరి	31,171	19,333
పత్తి	24,086	11,153
వేరుశనగ	5,971	2,683
కంది	3,894	7,718
మినుము	2,642	5,296
కొర్ర	976	1,398
సజ్జ	1,039	606
మొక్కజొన్న	637	1,526
పొద్దుతిరుగుడు	1,126	193
చిక్కుడు	963	387

కడప (రూరల్), సెప్టెంబర్ 19: ఖరీఫ్ పంటలకు కష్టకాలం దాపురించింది. నైరుతి రుతుపవనాలు వచ్చినా సరైన వానలు లేకపోవడంతో పంటలు దారుణంగా దెబ్బతిన్నాయి. ఖరీఫ్ సీజన్‌లో 403.3 మి.మీ. వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా కేవలం 299.5 మి.మీ. మాత్రమే నమోదు కావడంతో చాలా వరకు పంటలు ఎండుముఖం పట్టాయి. విత్తనం వేసినప్పటి నుంచి అదునుకు వానలు సక్రమంగా పడకపోవడంతో ఖరీఫ్ పంటలకు ముప్పువాటిల్లింది. ఇప్పటికే వేరుశనగ, మినుము పంటలు పూర్తిగా ఎండిపోవడంతో రైతులు వాటిని పశువులకు వదిలేశారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో 75,189 హెక్టార్లు సాగు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 51,154 హెక్టార్లలో మాత్రమే పంటలు సాగుకు నోచుకున్నాయి. ఇందులో బోరుబావులు ఇతర నీటి వనరుల కింద 14,567 హెక్టార్లలో పంటలు సాగు కాగా.. మిగిలిన 22,951 హెక్టార్లు వర్షాధారం కింద సాగయ్యాయి. వర్షాధారంతో సాగైన పంటల్లో 3,509 హెక్టార్లు ఎండిపోయినట్లు అధికారులు గుర్తించారు. ఇందులో 2,858 హెక్టార్లలో మినుము, 651 హెక్టార్లలో వేరుశనగ ఉందని వ్యవసాయాధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపారు. వాస్తవంగా ఇంతకంటే రెట్టింపులో పంటలు ఎండిపోయినట్లు రైతులు, రైతు సంఘాల నాయకులు వాపోతున్నారు. అలాగే వర్షాధారం కింద సాగైన పత్తి, కంది, కొర్ర, జొన్న పంటల పరిస్థితి కూడా అంతంత మాత్రంగానే ఉంది. అదునుకు వానల్లేక పంటలు ఎండిపోతుండటంతో రైతులకు కోట్లలో నష్టం వాటిల్లుతోంది.

నీటి వనరుల పంటలకూ కష్టమే

బోరుబావులు, ఇతర నీటివనరుల కింద సాగైన పంటలకు కూడా నీటి ఎద్దడి ముంచుకొస్తోంది. నైరుతి రుతుపవనాలు ముఖం చాటేసి ఆశించిన వర్షాలు పడకపోవడంతో బోరుబావుల్లో నీరు ఇంకిపోతోంది. దీంతో బోరుబావుల కింద పంటలను సాగుచేసిన రైతులు నీటి తడులు అందించేందుకు నానా అవస్థలు పడుతున్నారు. బోరుబావులు, ఇతర నీటి వనరుల కింద 14,567 హెక్టార్లలో పలు పంటలు సాగయ్యాయి. ఇందులో వరి పంట 13,445 హెక్టార్లలో, పత్తి 1,015 హెక్టార్లలో సాగుకు నోచుకున్నాయి. బోరుబావుల కింద సాగైన వరికి నీటిని అందించలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

ఆదుకోని నైరుతి రుతుపవనాలు

నైరుతి రుతుపవనాలు అన్నదాతను ఆదుకోలేదు. ఖరీఫ్ ప్రారంభం అయ్యే జూన్ నెల నుంచి సెప్టెంబరు వరకు నైరుతి రుతుపవనాలు ఉంటాయి. ప్రారంభంలో కాస్త వర్షాలు ఊరించినా ఆ తరువాత ముఖం చాటేశాయి. ఖరీఫ్‌కు సంబంధించిన జూన్, జూలై, ఆగస్టు, సెప్టెంబరు వరకు మొత్తం 403.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా గురువారం నాటికి 299.5 మిల్లీ మీటర్లు మాత్రమే నమోదైంది. జూన్ నెలలో 68.2 మిల్లీమీటర్ల వర్షపాతం అవసరం కాగా అధికంగా 138.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. తరువాత నెలల్లో ఆశించిన వర్షాలు కురవలేదు. జూలైలో 96.7 మి.మీ.కు గాను 55.4 మి.మీ, ఆగస్టులో 118.4 మి.మీ.కు గాను 97.4 మి.మీ, సెప్టెంబరు నెలలో 120 మి.మీ.కు గాను ఇప్పటి వరకు 35 మి.మీ వర్షపాతం నమోదైంది. తీవ్ర లోటు వర్షపాతం కారణంగా పంటలు చాలావరకు ఎండిపోతున్నాయి. కొన్నిచోట్ల రైతులు పంటలు కాపాడుకునేందుకు నానా తంటాలు పడుతుంటే మరికొందరు ఆశ వదులుకుని దున్నేస్తున్నారు.

3,509 హెక్టార్లలో ఎండుముఖం

ఖరీఫ్‌లో వర్షాధారం కింద సాగైన పంటలలో 3,509 హెక్టార్లలో ఎండుముఖం పట్టాయని జిల్లా వ్యవసాయాధికారి ఏ.నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఇందులో మినుము పంట 2,858 హెక్టార్లలో, వేరుశనగ 651 హెక్టార్లలో ఎండాయని ఈ మేరకు ప్రభుత్వానికి నివేదికలు పంపామని అన్నారు.



వరి సాగు అధికం

జిల్లాలో బోరుబావులు, ఇతర నీటి వనరుల కింద వరి పంట 13,445 హెక్టార్లలో సాగైంది. మండలాల వారీగా వరిసాగు హెక్టార్లలో..

చక్రాయపేట	1,052
పెండ్లిమర్రి	897
వేంపల్లె	451
చింతకొమ్మదిన్నె	245
కడప	889
సిద్దవటం	932
ఒంటిమిట్ట	269
చెన్నూరు	1229
వల్లూరు	973
కమలాపురం	343
యర్రగుంట్ల	690
వీఎన్ పల్లె	100
లింగాల	95
జమ్మలమడుగు	1062
ప్రొద్దుటూరు	1546
చాపాడు	5282
ఖాజీపేట	3339
గోపవరం	118
బద్వేల్	490
బి.కోడూరు	962
పోరుమామిళ్ల	964
కలసపాడు	868
కాశినాయన	587
బి.మఠం	1498
మైదుకూరు	1224
దువ్వూరు	2999
రాజుపాలెం	808
పెద్దముడియం	368
మైలవరం	271
కొండాపురం	390

జమ్మలమడుగు అన్నక్యాంటీన్‌లో భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి



పేదల ఆకలి తీర్చడమే లక్ష్యంగా..

అన్న క్యాంటీన్లు ప్రారంభం

పులివెందుల టౌన్/జమ్మలమడుగు/బద్వేలు టౌన్, సెప్టెంబరు 19: పేదల ఆకలి తీర్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ నేతలు పేర్కొన్నారు. ఐదేళ్ల తర్వాత జిల్లాలో అన్నక్యాంటీన్లు పునఃప్రారంభమయ్యాయి. గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లను.. వైసీపీ ప్రభుత్వం రాగానే జగన్ మూత వేయించారు. దీంతో రూ.5కే ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లు లేక పనులకోసం పట్టణాలకు వచ్చే పలువురు పేదలు ఇబ్బంది పడ్డారు. ఈ నేపథ్యంలో మరోసారి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు అన్నక్యాంటీన్లను తిరిగి ప్రారంభించారు. ఇందులో భాగంగా పులివెందుల పట్టణంలో నాలుగు రోడ్ల కూడలి వద్ద అన్నక్యాంటీన్‌ను గురువారం ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి, పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి ప్రారంభించారు. నాడు ఎన్టీఆర్, నేడు చంద్రబాబునాయుడు పేదల తీర్చేందుకు అనేక పథకాలకు శ్రీకారం పలికారని అందులో భాగంగానే అన్నక్యాంటీన్లు అందుబాటులోకి తీసుకువచ్చారని వారు తెలిపారు.

బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లా ఆవరణలో అన్న క్యాంటీన్‌ను బీజేపీ నేత బొజ్జ రోశన్నతో కలసి టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త రితేశ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. వీరు మాట్లాడుతూ నిత్యావసర ధరలు అధికంగా ఉన్న సమయంలో కూడా 5 రూపాయలకే మూడుపూటలా అల్పాహారం, భోజనం అందించడం సంతోషకరమన్నారు. అనంతరం రితేశ్‌కుమార్‌రెడ్డి నిరుపేదలకు భోజనం వడ్డించి, కూటమి నాయకులతో కలసి అన్నక్యాంటీన్లోనే భోజనం చేశారు.

జమ్మలమడుగులోని ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో అన్న క్యాంటీన్‌ను గురువారం రాత్రి 7.37 గంటలకు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి ప్రారంభించారు. ధరలు పెరిగినా చంద్రబాబునాయుడు 5 రూపాయలకు అన్నం పెట్టడం గర్వకారణమన్నారు. ఇచ్చిన మాట ప్రకారం తిరిగి అన్న క్యాంటీన్‌ను ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. అన్నక్యాంటీన్లు ప్రారంభం కావడంతో పలువురు పేద ప్రజలు, కార్మికులు రూ.5కే కడుపునిండా భోజనం చేసి సంతోషించారు.



పులివెందులలో అన్నక్యాంటీన్‌ను ప్రారంభించి పేదలకు అల్పాహారం అందిస్తున్న రామగోపాల్‌రెడ్డి, బీటెక్ రవి



బద్వేలులో అన్నక్యాంటీన్‌లో కూటమి నాయకులతో కలసి భోజనం చేస్తున్న రితేశ్‌కుమార్‌రెడ్డి, బొజ్జ రోశన్న తదితరులు

వంద రోజుల పాలన ప్రగతిని చాటుదాం

రాష్ట్ర ప్రభుత్వం వంద రోజుల్లో సాధించిన విజయాలను, ప్రగతిని రాష్ట్ర ప్రజలకు తెలియజేయడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని కలెక్టర్ లోతేటి శివశంకర్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాల్లో ఇది మంచి ప్రభుత్వం.. ఎందుకంటే? అనే కార్యక్రమం కార్యాచరణపై జేసీ అదితి సింగ్‌తో కలసి కలెక్టర్ మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ గడిచిన వంద రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం సాధించిన ప్రగతిని ప్రజలకు చాటి చెప్పేందుకు ఈ కార్యక్రమాన్ని ప్రాధాన్యతతో నిర్వహించాలన్నారు. ఈ నెల 20వ తేదీ నుంచి 26 వరకు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో గ్రామ సభలు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. అధికారులు పతి ఇంటికెళ్లి ప్రభుత్వం సాధించిన విజయాలపై రూపొందించిన స్టిక్కర్లు, పోస్టర్లను అంటించాలన్నారు.

రేపు డయల్ యువర్ ఆర్ఎం

కడప (మారుతీనగర్), సెప్టెంబరు 19: ఏదేని ఆర్టీసీ బస్సుల ప్రయాణంలో ప్రయాణికులకు ఉండే సందేహాలను నివృత్తి చేసుకునేందుకు వీలుగా 21వ తేదీ శనివారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల మధ్యలో డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమం తలపెట్టినట్లు ఆర్టీసీ కడప రీజనల్ మేనేజర్ పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. జిల్లాలోని ప్రజలు, ప్రయాణికులు తమ సమస్యలను, సందేహాలను, సూచనలను 9959225848 నెంబర్‌కు ఫోన్ చేసి లేదా వాట్సాప్ ద్వారా తెలియజేయాలని కోరారు.

నిబంధనల ప్రకారం కాంప్లెక్స్ రీఆర్గనైజేషన్

- ఒక పంచాయతీలో పాఠశాలలు ఒకే కాంప్లెక్స్‌లో ఉండాలి
- పాఠశాల విద్య ఆర్జేడీ శామ్యూల్

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 19: రాష్ట్ర విద్యాశాఖ నిబంధనల మేరకు కాంప్లెక్స్ రీఆర్గనైజేషన్ జరగాలని పాఠశాల విద్య ఆర్జేడీ శామ్యూల్ సూచించారు. గురువారం కలెక్టరేట్ సభాభవనంలో కడప, అన్నమయ్య జిల్లాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎంఈవోలు, కంప్యూటర్ ఆపరేటర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ కాంప్లెక్స్ రీఆర్గనైజేషన్ చేసే సమయంలో పంచాయతీలోని పాఠశాలలన్నీ ఒకే కాంప్లెక్స్‌లో ఉండే విధంగా, మున్సిపాలిటీలో ఒక వార్డుకు సంబంధించిన పాఠశాలలను ఒకే కాంప్లెక్స్‌లో ఉండేలా చూడాలన్నారు. ఒక కాంప్లెక్స్‌లో 30 మంది ఎస్జీటీలు ఉండాలన్నారు. విలేజ్ వార్డు ఎడ్యుకేషన్ సెక్రటరీలు, సీఆర్పీల సహకారంతో కాంప్లెక్స్ రీఆర్గనైజేషన్ చేసేటప్పుడు అంగన్వాడీలను, జూనియర్ కళాశాలలను కూడా దృష్టిలో ఉంచుకుని ఒకే క్లస్టరులో ఉంచాలన్నారు. అనంతరం డీఈవోలు మాట్లాడుతూ ఉప విద్యాధికారులు ఎంఈవోలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ కాంప్లెక్స్ రీఆర్గనైజేషన్ వీలైనంత త్వరగా జరిగేలా చూడాలని అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పాఠశాల విద్య ఆర్జేడీ శామ్యూల్



సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ శివశంకర్, ఎస్పీ హర్షవర్ధన్ రాజు, జేసీ అదితిసింగ్

ఇసుక బుకింగ్ మరింత సులభతరం

- శాండ్ పోర్టల్‌ను ప్రారంభించిన సీఎం
- కలెక్టర్ లోతేటి శివశంకర్

కడప(కలెక్టరేట్), సెప్టెంబరు 19: నూతన పాలసీ ప్రకారం ఇసుక బుకింగ్ మరింత సులభతరం కానుందని ఈ మేరకు.. రాష్ట్ర ప్రభుత్వం శాండ్ బుకింగ్ పోర్టల్‌ను అమలులోకి తీసుకొచ్చిందని కలెక్టర్ శివశంకర్ పేర్కొన్నారు. గురువారం అమరావతి నుంచి నూతన ఇసుక పాలసీ ప్రకారం ఉచితంగా ఇసుకను పొందేందుకు రాష్ట్ర గనులు, భూగర్భ శాఖలు ప్రత్యేకంగా రూపొందించిన ఏపీ శాండ్ పోర్టల్ వెబ్‌సైట్‌ను వర్చువల్ విధానం ద్వారా సీఎం చంద్రబాబునాయుడు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్‌తో పాటు ఎస్పీ హర్షవర్ధన్ రాజు, జేసీ అదితిసింగ్, సంబంధిత అధికారులు హాజరయ్యారు. ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ ముగిసిన తరువాత కలెక్టర్ మాట్లాడుతూ.. ఏపీ శాండ్ పోర్టల్ ద్వారా సులభతరంగా ఇసుకను ఎలా బుక్ చేసుకోవాలి? అనే అంశాలపై క్షుణ్ణంగా వివరించారు. వినియోగదారుడు కేవలం నిర్వహణ, రవాణా ఖర్చులు మాత్రమే చెల్లించాల్సి ఉంటుందన్నారు. వినియోగ దారుడు పోర్టల్‌లో బుక్ చేసుకున్న ఒకటి రెండు రోజుల్లో ఇసుక ఇంటి వద్దకే సరఫరా అవుతుందన్నారు. ఇసుక రవాణా కోసం సొంత వాహనాలు ఉంటే వినియోగించు కోవచ్చన్నారు. అయితే ఆ వాహనం గనుల శాఖలో రిజిస్టరై ఉండాలన్నారు. ముఖ్యంగా పని దినాల్లో మాత్రమే ఇసుక బుకింగ్ ఉంటుందన్నారు. గ్రామ వార్డు సచివాలయాల నుంచి కూడా ఇసుక బుకింగ్ చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రణాళికలు రూపొందించండి

స్వర్ణాంధ్ర ప్రదేశ్ విజన్-2047 లక్ష్యాలకు అనుగుణంగా జిల్లా ఆర్థికాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ శివశంకర్ అధికారులను ఆదేశించారు. గురువారం అమరావతి నుంచి చీఫ్ సెక్రటరీ నీరబ్ కుమార్‌ప్రసాద్, సంబంధిత కార్యదర్శులతో కలసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వర్చువల్ విధానంలో స్వర్ణాంధ్ర ప్రదేశ్ విజన్-2047పై సమీక్షించారు. ఈ కార్యక్రమానికి కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, డీఆర్వో గంగాధర గౌడ్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ముగిసిన అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ రానున్న ఐదు సంవత్సరాల్లో జిల్లాను మరింత అభివృద్ధి చేసే విధంగా ఆయా శాఖలు ప్రణాళికలు రూపొందించాలన్నారు. జిల్లాలోని 36 మండలాలు, ఏడు మున్సిపాలిటీలు, కడప కార్పొరేషన్ పరిధిలో జిల్లా విజన్ ప్లాన్‌పై ఫీడ్ బ్యాక్ సేకరిస్తామన్నారు. ఈ నెల 21 నుంచి వచ్చే నెల 5వరకు ప్రజా ప్రతినిధులు, రైతులు, జిల్లా ప్రముఖులతో సమావేశాలు ఏర్పాటు చేసి సలహాలు సూచనలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రణాళికాధికారి వెంకట్రావు, వ్యవసాయ శాఖ జేడీ నాగేశ్వరరావు, ఎంప్లాయిమెంట్ అధికారి సురేశ్‌కుమార్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రిమ్స్‌లో వైద్య విద్యకు అడ్మిషన్లు

కడప (సెవెన్‌రోడ్స్), సెప్టెంబరు 19: నీట్‌లో ర్యాంకులు సాధించి వైద్య విద్యలో ప్రవేశాలకు కడప రిమ్స్‌ను ఎంచుకున్న 139 మంది విద్యార్థులకు గురువారం అడ్మిషన్లు పూర్తయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన కోటా దీంతో ముగిసింది. జాతీయ స్థాయిలో కేటాయించిన 26 సీట్ల భర్తీకి శుక్రవారం నుంచి అడ్మిషన్లు నిర్వహించనున్నారు. అలాగే వివిధ కేటగిరీలకు కేటాయించిన పది సీట్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రావాల్సి ఉంది. కాగా.. ప్రభుత్వ వైద్యకళాశాల(రిమ్స్)లో ఫస్ట్ ఇయర్ ఎంబీబీఎస్ విద్యార్థుల పరీక్ష ఫలితాలు గురువారం వెలువడ్డాయి. ముగ్గురు విద్యార్థులు డిస్టింక్షన్ సాధించారు. 68 మంది ఫస్ట్ క్లాస్‌లో, 97 మంది ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారు. ఉత్తమ ఫలితాలు రావడంతో వైద్య అధ్యాపకులకు, వైద్యసిబ్బందికి, పరిపాలన సిబ్బందికి కడప ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.సురేఖ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు అడ్మిషన్ ఇస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ



మేయర్‌పై కార్పొరేటరు మండిపాటు

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 19: కడప మేయర్ సురేశ్‌బాబుపై కార్పొరేటరు సూర్యనారాయణ మండిపడ్డారు. తనకు డిప్యూటీ మేయర్ పదవి ఇస్తానని చెప్పి మోసం చేశాడని దుయ్యబట్టారు. సమావేశం నుంచి అర్థాంతరంగా బయటికి వెళ్లారు. గురువారం వైసీపీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి అధ్యక్షతన కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటరు సూర్యనారాయణ మాట్లాడుతూ.. తనకు డిప్యూటీ పదవిపై మోసం చేశారని అన్నారు. ఏదైనా అవసరం ఉంటే తమను వాడుకుంటారని పదవులు మాత్రం డబ్బులు ఇచ్చినవారికి, అనుకూలురుకు ఇచ్చుకుంటారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశాన్ని బహిష్కరించి మధ్యలోనే వెళ్లిపోయారు. అలాగే మరికొందరు కార్పొరేటర్లు మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు తమను ఏ మాత్రం పట్టించుకోలేదని మండిపడ్డారు. పార్టీకోసం పనిచేయాలంటే భయం వేస్తోందన్నారు. దీనిపై జిల్లా అధ్యక్షుడు స్పందిస్తూ పార్టీ ప్రస్తుతం అధికారంలో లేదని, ఇప్పుడు ఏం చేయలేని పరిస్థితుల్లో ఉన్నామని వారికి నచ్చచెప్పారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి ఒక్కరికీ న్యాయం చేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, మేయర్ సురేశ్‌బాబు, ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి



నర్సాపురం పోస్టాఫీస్ వద్ద గుమిగూడిన ఖాతాదారులు

నర్సాపురం పోస్టాఫీస్‌లో

పోస్టుమాస్టర్ చేతివాటం

- దాదాపు రూ.50 లక్షలు స్వాహా
- లబోదిబోమంటున్న ఖాతాదారులు

కాశినాయన సెప్టెంబరు 19: కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన పోస్టాఫీస్ అంటే పేదలకు, మధ్యతరగతి పొదుపుదారులకు గట్టి నమ్మకం. అలాంటి సంస్థలో పనిచేసే ఓ పోస్టుమాస్టర్ కంచే చేను మేసిన చందాన దాదాపు రూ.50లక్షలు నిధులను స్వాహా చేశాడు. కొద్దిరోజులుగా అతను అదృశ్యమయ్యాడు. దీనిపై బాధితులు గురువారం నర్సాపురం పోస్టాఫీస్ వద్దకు చేరుకుని ఆందోళన వ్యక్తం చేశారు. బాధితుల కథనం మేరకు.. నర్సాపురం పోస్టాఫీస్‌లో నాయక్ అనే అతను 13 సంవత్సరాలుగా పోస్టుమాస్టర్‌గా పనిచేస్తున్నాడు. దీంతో ఇతను పోస్టాఫీసుకు వచ్చేవారితో బాగా పరిచయాలు పెంచుకున్నాడు. ఖాతాదారులు సైతం ఇతనిపై నమ్మకం పెంచుకున్నారు. చాలా మంది ఈ పోస్టాఫీసులో నెలనెలా పొదుపు కడుతూ వస్తున్నారు. తినో తినకో ఆరుగాలం కష్టించి రూపాయి రూపాయి కూడబెట్టుకుని కొందరు, వచ్చే సామాజిక పింఛన్‌లో కొంత మిగుల్చుకుని మరికొందరు నెలనెలా పోస్టాఫీస్‌లో కట్టుకుంటూ వస్తున్నారు. ఇక్కడే పోస్టుమాస్టర్ చేతివాటం ప్రదర్శిస్తూ వచ్చాడు. ఖాతాదారులు పొదుపు కడుతున్న డబ్బును పుస్తకంలో రాసి సీల్ వేసి సంతకం చేసి బుక్ ఇస్తాడు కానీ ఆన్‌లైన్‌లో నమోదు చేయడు. మరికొందరి పుస్తకాలను నమ్మబలికి తనవద్దనే ఉంచుకున్నాడు. నెలనెలా ఇలా వచ్చిన డబ్బును వ్యక్తిగత అవసరాలకు వాడుకుంటూ వచ్చాడు. ఈ విషయాన్ని బయటికి పొక్కనివ్వకుండా కిందిస్థాయి వారిని మ్యానేజ్ చేసుకుంటూ వచ్చాడు. ఇలా దాదాపు రూ.50లక్షలు దారిమళ్లించినట్లు తెలిసింది.

పొదుపు గడువు ముగియడంతో..

పలువురు ఖాతాదారులకు పొదుపు సమయం ముగిసినా పోస్టుమాస్టర్ నాయక్ డబ్బు ఇవ్వకుండా సంతకాలు చేయించుకుని ఆ డబ్బును డ్రా చేసుకుని వ్యక్తిగత అవసరాలకు వాడుకున్నాడు. విషయం తెలుసుకున్న పొదుపుదారులు డబ్బుకోసం ఒత్తిడి చేయడంతో సదరు పోస్టమాస్టర్ విధులకు డుమ్మాకొట్టాడు. విషయం తెలుసుకున్న పైఅధికారులు గత నెల 27వ తేదన పోస్టాఫీసు తాళాలు పగులగొట్టి కార్యాలయం తెరిచి రికార్డులు పరిశీలించారు. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. అధికారులు మాత్రం పుస్తకాల్లో నమోదుచేసి ఉంటేనే బాధ్యత వహిస్తాము అంటున్నారు. ఈ నేపథ్యంలో పలువురు ఖాతాదారులు గురువారం పోలీసులను ఆశ్రయించారు.


ఈ విషయంపై బద్వేల్ డివిజన్ పోస్టల్ డిపార్ట్‌మెంట్ ఇన్‌చార్జి అమర్‌నాథ్‌ను వివరణ కోరగా నిధులు గోల్‌మాల్ జరిగినమాట వాస్తవమేనని అన్నారు. నర్సాపురం బ్రాంచ్‌లో 5రకాల పొదుపుల్లో దాదాపు 1000 మంది ఖాతాదారులు ఉన్నారని ఇప్పటివరకు దాదాపు 50శాతం పుస్తకాలు పరిశీలించగా రూ.15 లక్షలు దారిమళ్లించినట్లు గుర్తించామన్నారు. పూర్తిస్థాయి విచారణ ముగియగానే ఆధారాలు ఉన్నవారికి తిరిగి వడ్డీతో సహా డబ్బు చెల్లిస్తామన్నారు. చాలామంది ఆధారాలు లేకుండా డబ్బు ఇచ్చినట్లు, ఫోర్జరీ సంతకాలతో డబ్బు తీసుకున్నాడని చెబుతున్నారని వారిని కూడా పిలిపించి విచారించి ఒక లిస్ట్ తయారుచేసి న్యాయం జరిగేలా చూస్తామన్నారు.



ఫోర్జరీ సంతకాలతో డ్రా చేశారు..

నేను ఐదేళ్లుగా నెలకు రూ.4వేలు పొదుపు చేశాను. జూన్‌తో గడువు ముగిసింది రూ.2.90లక్షలు ఇస్తానని ఒక సంతకం చేయించుకున్నాడు. అదో ఇస్తాను అదో ఇస్తానని కాలయాపన చేస్తుంటే కలసపాడు సబ్‌పోస్టాఫీస్‌కు వెళ్లి విచారించగా నా సంతకం ఫోర్జరీ చేసి రోజుకు రూ.20వేల చొప్పున డ్రా చేశాడని చెప్పారు. ఖాతాలో కేవలం రూ.1,300లు ఉంది. అధికారులే న్యాయం చేయాలి.

\- విజయలక్ష్మి, నర్సాపురం



మీరే పట్టుకోని రండి అంటే ఎలా..?

నేను క్షవరం వృత్తిలో వచ్చే రూపాయ రూపాయని కూడబెట్టి కూతురు కోసం సుకన్య కింద పొదుపు కట్టుకున్నాను. మొదట్లో నెలకు రూ.1000 కట్టాను. 2023 సంవత్సరం నుంచి నెలకు రూ.10వేలకు పెంచుకున్నాను. 12నెలలుగా పుస్తకంలో రా యకుండా రూ.1.20లక్షలు వాడుకున్నాడు. పుస్తకం కూడా ఇవ్వలేదు. అధికారులను అడిగితే ఆధారాలు లేకుండా ఏమీ చేయలేము.. పోస్టుమాస్టర్ నాయక్ ను పట్టుకోని రాండి మాట్లాడదాం అంటున్నారు. ఇది ఎంతవరకు న్యాయం.

\- వెంకటసుబ్బయ్య, నర్సాపురం

ప్రణాళికాబద్ధమైన చదువులతో ఉద్యోగ అవకాశాలు



మాట్లాడుతున్న చికాగో ఆర్‌డీఎల్ టెక్నాలజీ సీఈవో

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 19: ప్రపంచస్థాయిలో నడవాలంటే ప్రణాళికాబద్ధంగా చదవాలని వైవీయూ వైస్‌చాన్సలర్ క్రిష్ణారెడ్డి తెలిపారు. యూఎస్ఏ, కెనడా, యూకే, ఆస్ట్రేలియా దేశాల్లో ఉన్నత చదువులు, ప్లేస్‌మెంటు అవకాశాలపై గురువారం వైవీయూలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వైస్‌చాన్సలర్ మాట్లాడుతూ సమాజం నీ కోసం ఎదురు చూస్తుందని విద్యార్థి దశలో జ్ఞానాన్ని సముపార్జించాలన్నారు. ఆంగ్లంలో సంభాషించేవారిని, చదువుతున్న కోర్సుల్లో మార్కుల పరంగా ప్రతిభచూపిన వారికి విదేశాల్లో విద్య ఉద్యోగ అవకాశాలుంటాయన్నారు. చికాగో ఆర్‌డీఎల్ టెక్నాలజీ సీఈవో వ్యవస్థాపకుడు కె.రామారావు మాట్లాడుతూ డిగ్రీ చదువుతున్న విద్యార్థులు పై చదువులకు, పీజీ విద్యార్థులు పరిశోధనలకు, ఉద్యోగావకాశాల కోసం విదేశాలకు వెళ్లాలనుకునేవారికి ఆర్‌డీఎల్ టెక్నాలజీ సంస్థ ఉచితంగా సహాయపడుతుందన్నారు. విదేశాల్లో టాప్ 100 విశ్వవిద్యాలయాల్లో సీటు పొందే విధానం.. అందుకు గల అర్హతలు, పాస్‌పోర్టు పొందే విధానం గురించి అవగాహన కల్పించారు. ప్లేస్‌మెంటు సెల్ డైరెక్టరు ప్రొఫెసరు ఎస్‌వీ రెడ్డి, సైకాలజీ సహాచార్యులు డాక్టర్ లాజర్ పాల్గొన్నారు.

ఏఎఫ్ఏయూ సెమిస్టరు పరీక్ష ఫలితాలు విడుదల



కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 19 : కడప నగరం డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ యూనివర్శిటీ స్కూల్ ఆఫ్ ప్లానింగ్‌కు సంబంధించి ఆర్కిటెక్చర్ రెండో సెమిస్టరు ఫలితాలను వైస్ చాన్సలర్ ప్రొఫెసరు విశ్వనాధకుమార్ విడుదల చేశారు. గురువారం పరీక్షల విభాగంతో కలిసి ఫలితాలు విడుదల చేశారు. వైస్‌చాన్సలర్ మాట్లాడుతూ ఆర్కిటెక్చర్ రెండో సెమిస్టరులో 90 శాతం మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. ఫలితాలను కళాశాల వెబ్‌సైట్‌లో పొందుపరిచామని.. అతి తక్కువ సమయంలోనే ఫలితాలు విడుదల చేసేందుకు కృషి చేసిన పరీక్షల విభాగాన్ని వారు అభినందించారు. కార్యక్రమంలో అదనపు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఫణీంద్రరెడ్డి, ఉదయ ప్రకాశ్‌రెడ్డి, లక్ష్మీప్రవల్లిక పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సంబేపల్లె, సెప్టెంబరు19: మండల పరిధిలోని కర్నూలు- చిత్తూరు జాతీయ రహదారి దేవపట్ల ఎస్టీ కాలనీ వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో చల్లా రాజా (24) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు... ఎర్రబెల్లి రోడ్డు దేవపట్లకు చెందిన చల్లా రాజా వడ్డెర వృత్తి పనిలో భాగంగా సమీపంలోని కొండకు వెళ్లి బండ్రాళ్లు కొట్టి ఇంటికి తిరిగి ద్విచక్రవాహనంలో వస్తుండగా.. దేవపట్ల ఎస్టీ కాలనీ వద్ద ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి కొడుకు, భార్య కలరు. ప్రమాద విషయం తెలుసుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని.. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భక్తవత్సలం తెలిపారు.

విద్యుదాఘాతంతో బోదకొట్టం దగ్ధం

మైదుకూరు రూరల్, సెప్టెంబరు 19: మండలంలోని ముదిరెడ్డిపల్లె తాండాలో నివాసముంటున్న మూడే సుబ్బమ్మకు చెందిన బోదకొట్టం గురువారం విద్యుదాఘాతంతో కాలిబూడిదైంది. వివరాలిలా.. సుబ్బమ్మ ప్రతి రోజూ పొలాల్లో కూలి పనికి వెళ్తుండేది. ఈమె భర్త కొన్నేళ్ల కిందట మరణించాడు. పిల్లలు వివాహమై వేరు కాపురం ఉండడంతో ఈమె ఒక్కటే నివాసం ఉంటోంది. ఈ క్రమంలో రోజులాగే కూలి పనికి వెళ్లింది. కాగా ఇంట్లోని విద్యుత్ వైర్లు షార్ట్ సర్క్యూట్ కావడంతో ఈఘటన జరిగింది. దీంతో ఇంట్లోని సామాన్లు, దుస్తులు, బియ్యం మూటలు, కొంతమేర నగదు పూర్తిగా దగ్ధమయ్యాయి. సుమారు రూ.2 లక్షల మేర ఆస్తి నష్టం జరిగిందని.. బాధితురాలు కన్నీరుమున్నీరై విలపించింది.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యాయత్నం

కడప క్రైం, సెప్టెంబరు 19: కడప నగరం నాగరాజుపేటలో ఉన్న ఇంటర్ కాలేజ్‌లో చదువుతున్న ఓ ఇంటర్ విద్యార్థి గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కడపకు చెందిన యువకుడు ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఉదయం కాలేజికి వెళ్లిన విద్యార్థి 11.30 గంటలకు కళాశాల వెనుక భాగంలో ఉన్న ఖాళీ స్థలం వద్దకు వెళ్లి తలకు రాసుకునే రంగు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తోటి విద్యార్థులు, అధ్యాపకులు గమనించి రిమ్స్‌కు తరలించారు. అయితే విద్యార్థి ఆత్మహత్యయత్నానికి గల కారణాలు తెలియడం లేదు. విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాలు రిమ్స్‌కు వెళ్లి చికిత్స పొందుతున్న విద్యార్థిని పరామర్శించారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

కడప క్రైం సెప్టెంబరు 19: గత ప్రభుత్వం 2022లో కానిస్టేబుల్ ఉద్యోగాలకు నోటిఫికేషన్‌ను విడుదల చేసి ప్రాథమిక పరీక్షలు నిర్వహించి.. ఎంపికలు జరపలేదని, వాటిని భర్తీ చేయడంతో పాటు పోలీసు ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయలేదని ఓయువకుడు మనస్థాపం చెంది ఈనెల 17న ప్రభుత్వ ఆర్ట్స్‌కాలేజి మైదానం వద్ద ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు చికిత్స నిమిత్తం యువకుడిని రిమ్స్‌కు తరలించారు. వివరాలిలా.. పాత కడపకు చెందిన ప్రదీప్ 2022 పోలీస్ కానిస్టేబుల్ ఉద్యగ నోటిఫికేషన్ విడుదల కావడంతో దరఖాస్తు చేసుకున్నారు. ప్రాథమిక పరీక్షలో అర్హత సాధించి తరువాత పరీక్షలకు సిద్ధమవుతన్న సమయంలో ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ కారణంగా ఎంపికలను నిలిపివేశారు. తరువాత ఎంపికలు జరగలేదని, ప్రస్తుతం ఆ ఎంపికలు జరుపుతారో లేదోనని మనస్థాపంచెంది విషద్రావణం తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. తన తండ్రి ఐదేళ్ల క్రితం చనిపోవడంతో పోలీస్ ఉద్యోగంపై ఆశలు పెట్టుకున్నానని.. ప్రభుత్వం స్పందించి 2022 ఎంపికలను కొనసాగించాలని కోరారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో... ఒకరికి జైలు శిక్ష

కడప (క్రైం), సెప్టెంబరు 19 : మద్యం సేవించి బైకు నడిపిన వ్యక్తికి ఏడు రోజులు జైలుశిక్షతో పాటు రూ.3వేలు జరిమానా విధిస్తూ ఫస్ట్ స్పెషల్ జేఎస్ సీఎం కోర్టు మెజిస్ట్రేట్ మంగళగౌరి తీర్పునిచ్చినట్లు కడప ట్రాఫిక్ సీఐ జావేద్ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. ఈ నెల 17న కడపకు చెందిన రమేశ్‌రెడ్డి మద్యం సేవించి బైకు నడుపుతుండగా.. తనిఖీల్లో పట్టుబడ్డాడు. అతనిపై కేసు నమోదుచేసి న్యాయస్థానం ఎదుట హాజరుపరచడంతో న్యాయాధికారి విచారించి జైలుశిక్షతో పాటు జరిమానా విధించినట్లు తెలిపారు.

నెల్లూరులో రైల్వేకోడూరు వాసి మృతి

రైల్వేకోడూరు, సెప్టెంబరు 19: నెల్లూరులో రైల్వేకోడూరు వాసి మృతి చెందిన సంఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగుచూసింది. రైల్వేకోడూరు పోలీసుల వివరాల మేరకు...రైల్వేకోడూరు మండలానికి చెందిన మామిడి వెంకటయ్య (50) ప్రతి రోజు మద్యం తాగి ఇంటికి వస్తుండడంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో మనస్థాపానికి గురై పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చేర్పించి వైద్య సేవలు అందించారు. తర్వాత వెంకటయ్య నెల్లూరు జిల్లా గొలగమూడి వెంకయ్యస్వామి ఆలయం వద్ద కొన్ని రోజుల పాటు కాలం గడిపాడు. కాగా, ఈనెల 14న వెంకటయ్య అపస్మారకస్థితి చేరుకున్నాడు. దీంతో అక్కడి భక్తులు 108 వాహనంలో నెల్లూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 17న మృతి చెందాడు. రైల్వేకోడూరు పోలీసులు నెల్లూరుకు వెళ్లి జరిగిన సంఘటనపై ఆరా తీశారు. గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ విజయ్‌కుమార్ తెలిపారు.

కుమార్తె కనిపించలేదని తండ్రి ఫిర్యాదు

పోరుమామిళ్ల, సెప్టెంబరు 19: తన కుమార్తె కనబడడంలేదని చల్లా అంజయ్య అనే వ్యక్తి స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. పోరుమామిళ్ల మండలంలోని ఎస్టీ కాలనీలో నివాసం ఉంటున్న చల్లా అంజయ్య పెద్దకుమార్తె అంజలి(14) 17వ తేదీ రాత్రి ఇంటి వద్దనే నిద్రపోయిందని, మరుసటి రోజు ఉదయం నిద్రలేచి చూడగా కనబడలేదు. చుట్టుపక్కల వెతికినీ ఆచూకీ తెలియకపోవడంతో 19వ తేదీ స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

రూ.10 నాణెం వద్దే వద్దు

- నోట్ల కొరత.. నాణేలే దిక్కు
- అయినా తిరస్కరిస్తున్న వ్యాపారులు
- పెట్రోలు బంకుల్లోనూ అంతే
- ఆర్‌బీఐ సూచనలు బేఖాతరు



పులివెందుల టౌన్, సెప్టెంబరు 19 : ఓ పక్క పదిరూపాయల నాణెం చెల్లుతుందని ఆర్‌బీఐ చెబుతున్నా నాణేలు తీసుకునేందుకు వ్యాపారులు నిరాకరిస్తున్నారు. ఆర్టీసీ బస్సుల్లోనూ.. చివరికి పెట్రోలు బంకుల్లో సైతం ఇదే పద్ధతి అవలంబిస్తున్నారు. పది రూపాయల నోట్ల స్థానంలో ఐదేళ్ల క్రితం పది నాణేలను ఆర్‌బీఐ అందుబాటులోకి తెచ్చింది. కొంత కాలం ఈ నాణేలపై ఎటువంటి అభ్యంతరాలు లేకపోయినా రెండేళ్ల నుంచి దుకాణదారులు వాటిని తీసుకునేందుకు నిరాకరిస్తూ వచ్చారు. పై నాణేలు వినియోగంలోనే ఉన్నాయంటూ ఆర్‌బీఐ చెబుతున్నా వ్యాపారులు వాటిని తీసుకునేందుకు వెనుకాడుతున్నారు. ఇటీవల పది రూపాయల నోట్ల కొరత వచ్చింది. ఇందుకు ప్రత్యామ్నాయమైన పది నాణెం చెలామణి అవుతుందని చెబుతున్నా కొంత మంది వ్యాపారులు తీసుకునేందుకు ససేమిరా అంటున్నారు.

2019లో ఆర్‌బీఐ ప్రవేశపెట్టిన పది రూపాయల నాణేన్ని స్టాండర్డ్ డిజైన్‌తో నాలుగు రకాలుగా విడుదల చేశారు. పది రూపాయల నోటు ఎక్కువ కాలం నాణ్యత, మన్నికగా ఉండదు. దీంతో సుమారు 20ఏళ్ల పాటు చెలామణిలో మన్నికగా ఉండేలా ఆర్‌బీఐ పది రూపాయల నాణేన్ని అందుబాటులోకి తెచ్చింది. రూపాయి, రెండు, ఐదు రూపాయల నాణేల తరువాత పది రూపాయల నాణెం విలువైనది.

ఇప్పటికీ ఐదేళ్లుగా దేశవ్యాప్తంగా చెలామణిలో ఉన్నా మన ప్రాంతంలో అందుబాటులో లేదు. పొరుగు రాష్ట్రమైన తమిళనాడు, చెన్నై, మహానగరాల్లో ఆ నాణెం చెల్లుబాటులో ఉంది. ఆ రాష్ట్ర ఆర్టీసీ బస్సులు, వ్యాపార సముదాయాల్లో విరివిగా వినియోగిస్తున్నారు. ఇక్కడ వినియోగంలో ఉన్న నాణేన్ని పులివెందులలో ఎందుకు తిరస్కరిస్తున్నారో అర్థం కాని పరిస్థితి.

పులివెందులలో నోట్ల కొరత ఎక్కువగా ఉంది. ఈక్రమంలో కొద్దిరోజుల క్రితం ఆర్‌బీఐ మరోసారి పది రూపాయల నాణేల వినియోగంపై క్లారిటీ ఇచ్చింది. వీటిని తిరస్కరించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. అయినా దుకాణ యజమానుల్లో మార్పు రాలేదు. దీనికి తోడు పెట్రోలు బంకుల్లో సైతం ఈ నాణేలు తీసుకునేందుకు నిరాకరిస్తున్నారు.

తీసుకోకపోతే.. కేసు నమోదు

పది నాణెం చెలామణిలో ఉందని... అన్ని చోట్ల అది చెల్లుబాటు అవుతుందని ఇటీవల రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) స్పష్టం చేసింది. బ్యాంకర్లు తిరస్కరిస్తే ఎల్‌డీఎంలకు ఆయా బ్యాంకుల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసే అవకాశం కల్పించింది. వాణిజ్య సముదాయాల్లో నాణేన్ని తీసుకోకపోతే నేరుగా పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేస్తారు. పది నాణెం చెలామణిపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంది. ఆ దిశగా బ్యాంకర్లు బాధ్యతగా తీసుకుని పది నాణెంపై ప్రచారం నిర్వహిస్తే వాటి చెలామణి పెరుగుతుంది. వ్యాపారులతో సత్సంబంధాలు కలిగిన జీఎస్టీ అధికారులు కూడా వ్యాపారులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. కాగా, పులివెందుల పట్టణంలో మెయిన్ రోడ్డు సమీపంలో ఉన్న పెట్రోలు బంకులో కొందరు వాహనదారులు రూ.10 నాణేలను ఇవ్వగా.. అక్కడ సిబ్బంది తిరస్కరించడంతో వారితో వాగ్వివాదానికి దిగారు. చిన్నవ్యాపారులు అవగాహన లేక నాణేలు తిరస్కరిస్తున్నారంటే వారిలో ఉన్న భయాలకు అర్థం ఉంది. కానీ కేంద్ర పెట్రోలియం సంస్థల ద్వారా నడిచే పెట్రోలు బంకుల్లో సైతం తిరస్కరించడం విడ్డూరంగా ఉందని.. వాటిపై చర్యలు తీసుకోవాలంటూ స్థానికులు కోరుతున్నారు.

పది రూపాయల నాణెం ఎక్కడైనా చెల్లుతుంది.

పది రూపాయల నాణెం తమిళనాడుతో పాటు ఇతర రాష్ట్రాలలో చలామణిలో ఉంది. ఏపీలో ముఖ్యంగా కడప జిల్లా పులివెందులలో చెలామణిలో లేదు. బ్యాంకుల్లో వాటిని మార్చుకోవచ్చు. డిపాజిట్ చేయవచ్చు. ఈనాణేన్ని తిరస్కరించే బ్యాంకర్లపై ఫిర్యాదు చేయవచ్చు, వ్యాపారులు ఇతరులకు ఈ నాణెంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

- జనార్ధనరావు, ఎల్‌డీఎం

వివేకానందుని బాటలో యువత నడవాలి

- స్టెప్ సీఈఓ సాయిగ్రేస్



మాట్లాడుతున్న స్టెప్ సీఈవో సాయిగ్రేస్



జానపద కళా నృత్యాలు వేస్తున్న యువతులు

కడప (స్పోర్ట్స్) సెప్టెంబర్ 19: స్వామి వివేకానందుని అడుగుజాడలలో నడిచి యువత సన్మార్గం వైపు పయనించాలని స్టెప్ సీఈఓ సి.సాయిగ్రేస్ అన్నారు. వివేకానందుని జయంతి సందర్భంగా స్టెప్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక స్పిరిట్స్ డిగ్రీ కళాశాలలో జిల్లాస్థాయి యువజనోత్సవాలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి సుమారు 230 మంది హాజరయ్యారు. కాగా ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఉద్దేశించి సాయిగ్రేస్ మాట్లాడుతూ యువతకు ఆదర్శప్రాయుడుగా ఖ్యాతిగాంచిన స్వామి వివేకానందుడి జయంతిని పురష్కరించుకుని జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో యువజనోత్సవాలు జరుగనున్నాయన్నారు. ప్రధానంగా యువతకు విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలలో కూడా పాల్గొనాలన్నారు. డాక్టర్ వైయస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.విశ్వనాధకుమార్ మాట్లాడుతూ సమాజంలో మంచి కన్నా చెడు ఎక్కువగా ప్రభావం చూపుతుందని, యువత మంచి మార్గంలో పయనించి తల్లిదండ్రులకు, సమాజానికి పేరు తీసుకురావాలన్నారు. అప్పుడే సమాజ వికాసం కాగలదన్నారు. మైనార్టీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.బ్రహ్మయ్య, జిల్లా ఫైర్ అధికారి ధర్మారావు, నెహ్రూ యువకేంద్ర జిల్లా యువ అధికారి మణికంత, స్పిరిట్స్ కళాశాల డైరెక్టర్ రవీంద్ర, కళాశాల, స్టెప్ సిబ్బంది పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు

యువజనోత్సవాలలో భాగంగా జానపద, స్టోరీ రైటింగ్, పెయింటింగ్, కవిత్వం, డిక్లమేషన్ తదితర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఇందులో పోయట్రీ విభాగంలో బి.దస్తగిరి ప్రథమ విజేతగా, ఎస్.సురేఖ ద్వితీయ విజేతగా నిలిచారు. డిక్లమేషన్ విభాగంలో ప్రథమ విజేతగా ఎస్. సమీనా, ద్వితీయ విజేతగా ఎస్.ఏ.అహ్మద్, స్టోరీ రైటింగ్ విభాగంలో ప్రథమ విజేతగా ఎస్.సానియా, ద్వితీయ విజేతగా ఎస్.జెబా, పెయింటింగ్ విభాగంలో ప్రథమ విజేతగా హరినాయక్, ద్వితీయ విజేతగా టి.చంద్రభాను నిలిచారు. ఫోక్ డాన్స్ (గ్రూప్) ప్రథమ విజేతగా పి.యస్విత, ద్వితీయ విజేతగా జయచంద్ర, ఫోక్ డ్యాన్స్ (సోలో) ప్రథమ విజేతగా ఎన్.ఉషోదయ, ద్వితీయ విజేతగా టి.సుదేష్ణ, ఫోక్ సాంగ్ (సోలో) ప్రథమ విజేతగా కె.మురళిమోహన్, ద్వితీయ విజేతగా డి.అనుష, ఫోక్ సాంగ్ (గ్రూప్) ప్రథమ విజేతగా ఎం.గణేష్ నిలవడంతో బహుమతులు అందజేశారు.

ఇసుక బుకింగ్ మరింత సులభతరం

- అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చామకూరి

రాయచోటి(కలెక్టరేట్) సెప్టంబరు 19: నూతన ఇసుక పాలసీ ప్రకారం ఇసుక సులభంగా బుక్ చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం శాండిల్ బుకింగ్ పోర్టల్‌ను అమలులోకి తీసుకువచ్చిందని కలెక్టర్ శ్రీధర్ చామ కూరి పేర్కొన్నారు. గురువారం అమరావతి నుంచి నూతన ఇసుక పాలసీ ప్రకారం ఉచితంగా ఇసుకను పొందేందుకు రాష్ట్ర గనులశాఖ, భూగర్భశాఖ వారు రూపొందించిన ఏపీ శాండిల్ పోర్టల్‌ను వర్చువల్ విధానంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. అన్నమయ్య జిల్లా నుంచి కలెక్టర్, డీఆర్ఓ హాజరయ్యారు. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ వినియోగదారులకు ఉచిత ఇసుక ఇవ్వడమే కాకుండా, వారు కోరుకుంటే అ ఇసుకను ఇంటికి చేర్చేలా ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ఇందుకోసం కేవలం రవాణా చార్జీలు చెల్లించాల్సి వుంటుందన్నారు. గనులశాఖ అధికారి రవిప్రసాద్, ఆర్‌టీఓ భరత్ చౌహాన్, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

మూడు నెలల పసి కందును దాచేసిన తండ్రి

కడప (క్రైం), సెప్టెంబరు 19: మూడు నెలల పసి కందును ఓ తండ్రి దాచేసిన సంఘటన కడప నగరం తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. వల్లూరుకు చెందిన మణికంఠ, వీరపునాయునిపల్లెకు చెందిన మౌనికకు ప్రేమ వివాహం జరిగింది. వీరికి ఈ ఏడాది జూన్ 13న ఆడబిడ్డ జన్మించింది. వీరిద్దరూ కడప బాలాజీ నగర్‌లోని మణికంఠ స్నేహితుడి ఇంట్లో ఉంటున్నారు. కాగా మణికంఠ మరుసటి రోజు ఆ పసికందును మౌనికకు తెలియకుండా ఇందిరానగర్‌లోని బంధువుల సంరక్షణలో ఉంచాడు. భార్య నిలదీయడంతో డాక్టర్ వద్ద పాపను చూపిస్తున్నానని చెప్పాడు. అందుకు సందేహించిన భార్య గట్టిగా నిలదీసింది. మణికంఠ సరిగా స్పందించకపోవడంతో తాలూకా సీఐ వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేసింది. దీంతో మణికంఠను విచారించగా.. తమది ఒకే గోత్రం కావడంతో పాపను బంధువులకు అప్పగించానని తెలిపాడు. సీఐ ఆ పాపను తెప్పించి ఐసీడీఎస్ అధికారులకు అప్పగించారు. భార్యా భర్తలకు కౌన్సెలింగ్ ఇచ్చి ఆ చిన్నారిని తల్లికి అప్పగించారు. దీనిపై సంబంధిత అధికారులు సమగ్రంగా విచారిస్తున్నారు.

నేడు టెక్స్‌టైల్ పార్కులోని ప్లాట్లకు లాటరీ

మైలవరం, సెప్టెంబరు 19: మైలవరం టెక్స్‌టైల్ పార్కులో ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసుకున్న లబ్ధిదారులకు శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ లోతేటి శివశంకర్ చేతుల మీదుగా లాటరీ తీసి ప్లాట్లను కేటాయిస్తారని జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారి నాగరాజారావు తెలిపారు. టెక్స్‌టైల్ పార్కులో మొత్తం 118 ప్లాట్లు ఉండగా.. 79 ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని.. ఒక్కో ప్లాటుకు రూ.50వేల చొప్పున 79 మంది లబ్ధిదారులు చెల్లించారన్నారు. హ్యాండ్‌లూమ్, పవర్‌లూం, డ్రాయింగ్ తదితర యూనిట్లకు ప్లాట్లు లాటరీ ద్వారా కేటాయించడం జరుగుతుందన్నారు.మిగిలిన ప్లాట్లకు లబ్ధిదారులు రూ.50 వేల చొప్పున చెల్లిస్తే వారికి లాటరీ ద్వారా త్వరలోనే కేటాయిస్తామని.. చేనేతలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా చేనేత జౌళిశాఖాధికారి నాగరాజారావు తెలిపారు.

రేపు డయల్ యువర్ ఆర్ఎం

కడప (మారుతీనగర్) సెప్టెంబర్ 19: ఆర్టీసీ బస్సుల ప్రయాణంలో ప్రయాణీకులకు వుండే అనుమానాలను, సందేహాలను నివృత్తి చేసుకునేందుకు ఈనెల 21వ తేదీ శనివారం సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల మధ్యలో డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమం తలపెట్టినట్లు ఆర్టీసీ కడప రీజనల్ మేనేజర్ గోపాల్‌రెడ్డి తెలిపారు. జిల్లాలోని ప్రజలు, ప్రయాణీకులు తమ సమస్యలను, సందేహాలను, సూచనలను 9959225848 నెంబర్‌కు ఫోన్ చేసి కానీ వాట్సాప్ ద్వారా తెలియపరచాలని కోరారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సామాజిక న్యాయ సాధకుడు చంద్రబాబు

- ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వరరావు మాదిగ



కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

కడప (మారుతీనగర్), సెప్టెంబర్ 19: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే సామాజిక న్యాయం సాధ్యం కాగలదని ఆంధ్రప్రదేశ్ మాది గ రిజర్వేషన్ పోరాట సమితి (ఏపీ ఎంఆర్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణకు చంద్రబాబు అండగా వుండడమే కాకుండా.. గతంలో ఎన్నడూ లేని విధంగా మాదిగలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించిన చంద్రబాబుకు కృతజ్ఞత తెలిపేలా గత ఆగస్టు 16న హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకు మాదిగల కృతజ్ఞతయాత్ర చేపట్టిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా ఎంఆర్‌పీఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక మహావీర్ సర్కిల్ వద్ద గల దేశ మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరావు మాదిగ మాట్లాడుతూ ఎస్సీ కులంలోని ప్రధాన మాల, మాదిగలతో పాటు మిగతా ఉప కులాలు కూడా సమాజంలో పురోగతి సాధించేందుకు వీలుగా ఎస్సీ వర్గీకరణ అమ లు చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఎస్సీ రిజర్వేషన్‌ల వర్గీకరణపై రాష్ట్రాలకు అధికారాలు ఇస్తూ గత ఆగస్టు 1న సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు మన దేశ సామిజిక ఉద్యమాల చరిత్రలోనే గొప్ప తీర్పు అన్నారు. ఈ తీర్పు వెలువడిన వెంటనే అమలు చేస్తామని మాదిగలకు భరోసా ఇచ్చిన దార్శనికుడు చంద్రబాబు అన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి తప్పెట హరిబాబు, తెలుగు రాష్ట్రాల కార్యదర్శి గొడుగునూరు మునెయ్య, జిల్లా అధ్యక్షుడు తప్పెట శివకుమార్, నాయకులు కె.బాబు, జి.గురవయ్య, సంజీవ్, వి.నారాయణ, రాములయ్య, జి.శ్రీనివాసులు, సి.నాగార్జున, ఎస్.ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఉద్యోగుల సాధారణ బదిలీలు

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 19: మున్సిపల్ ఉద్యోగుల సాధారణ బదిలీలు అనంతపురం రీజనల్ డైరెక్టర్ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ బదిలీల్లో ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో వున్న సీనియర్ అసిస్టెంట్ గంగాదేవి శ్రీకాళహస్తికి బదిలీ కాగా.. ఎర్రగుంట్లలో వున్న సీనియర్ అసిస్టెంట్ గంగిరెడ్డి ఇక్కడకు బదిలీ అయ్యారు. ప్రొద్దుటూరులో జూనియర్ అకౌంటెంట్‌గా వున్న కె.బాల వెంకటసుబ్రమణ్యం స్వామి, సీనియర్ అకౌంటెంట్ జి.ప్రవీణ్‌కుమార్‌లు మైదుకూరుకు బదిలీపై వెళ్లారు. వారి స్థానంలో సీనియర్ అకౌంటెంట్ ఐజయ్య జమ్మలమడుగు నుంచి ప్రొద్దుటూరుకు రానున్నారు. జూనియర్ అకౌంటెంట్ మాత్రం ఎవ్వరూ రాలేదు. ఇక్కడ పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్‌లు కె.విజయ, స్వర్ణలత ఎర్రగుంట్లకు, బి.వెంకట సుబ్బారెడ్డి పులివెందులకు, వి.వెంకట కిరణ్‌కుమార్ జమ్మలమడుగుకు, బి.రామలక్షుమ్మ రాయచోటికి, శ్రీనివాసులరెడ్డి బద్వేల్‌కు, ఎం.రమేష్ పులివెందులకు బదిలీ అయ్యారు. ఎర్రగుంట్ల నుంచి బి.లక్ష్మీనారాయణ, పులివెందుల నుంచి షేక్ షఫీవుల్లా, జమ్మలమడుగు నుంచి కె.స్వర్ణలత, బద్వేలు నుంచి హిమబిందు ప్రొద్దుటూరుకు జూనియర్ అసిస్టెంట్లుగా రానున్నారు. అయితే వీరిలో షఫీవుల్లాను ప్రొద్దుటూరుకు బదిలీ చేసినా.. డిప్యూటేషన్‌పై కమలాపురం వేశారు. దీంతో ఇక్కడ వున్న ఆరుగురు జూనియర్ అసిస్టెంట్లు బదిలీపై వెళితే.. ఇక్కడికి ముగ్గురు మాత్రమే జూనియర్ అసిస్టెంట్లుగా బదిలీపై రానున్నారు. అలాగే జూనియర్ అకౌంటెంట్ సుబ్రమణ్యం స్థానంలో ఎవ్వరిని వేయలేదు. దీంతో ఇక్కడ జూనియర్ అకౌంటెంట్ పోస్టు ఖాళీగా వుంది. ఇంత పెద్దమున్సిపాలిటీలో ఒక్క జూనియర్ అకౌంటెంట్ లేని పరిస్థితి నెలకొంది. కేవలం ఒక్క సీనియర్ అకౌంటెంట్‌తో నడపాలంటే కష్టమౌతుందని ఉద్యోగులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

మైలవరానికి 5వేల క్యూసెక్కుల నీరు విడుదల

కొండాపురం, సెప్టెంబరు 19: గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి 5000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. గండికోట ప్రాజెక్టులో 25.5 టీఎంసీల నీటిమట్టం స్థిరంగా ఉండేలా అనుబంధ జలాశయాలకు నీటిని పంపుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 7,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందని తెలిపారు. అదేవిధంగా సీబీఆర్‌కు 1000 క్యూసెక్కులు, పైడిపాలెం రిజర్వాయర్‌కు 770 క్యూసెక్కులు, వామికొండ, సర్వరాయసాగర్‌కు 700 క్యూసెక్కుల చొప్పున గండికోట ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. కాగా ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 25.5 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

రేపటి నుంచి ఎస్‌జీఎఫ్ మండలస్థాయి క్రీడలు

కడప (స్పోర్ట్స్) సెప్టెంబర్ 19 : జిల్లా స్పోర్ట్స్ అథారిటీ (డీఎస్ఏ) స్టేడియంలో ఈనెల 21వ తేదీ శనివారం నుంచి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) కడప మండల స్థాయి క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు మండల కో ఆర్డినేటర్ ఎస్.సాజిత్ వెల్లడించారు. ఇందులో 14 నుంచి 17 సంవత్సరాల బాల, బాలికలు పాల్గొనాల్సి ఉంటుందన్నారు. ఇందులో భాగంగా ఈనెల 21న చెస్, యోగా పోటీలు ఉంటాయన్నారు. 23వ తేదీ సోమవారం బ్యాడ్మింటన్ (షటిల్), వాలీబాల్ పోటీలు జరుగనున్నట్లు స్పష్టం చేశారు. 24న నగర మునిసిపల్ కార్పొరేషన్ ఉర్దూ హైస్కూల్‌లో కబడ్డీ పోటీలు, 25న అదే పాఠశాలలో ఖో..ఖో పోటీలు జరుగనున్నట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని మండల స్థాయి క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పేదల ఆకలి తీర్చడమే టీడీపీ కూటమి లక్ష్యం

- ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, టీడీపీ ఇన్‌చార్జ్ బీటెక్ రవి
- పులివెందులలో ఘనంగా అన్న క్యాంటీన్ ప్రారంభం

పులివెందుల/పులివెందుల టౌన్, సెప్టెంబరు 19 : పేదల ఆకలి తీర్చడమే టీడీపీ కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి, పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) పేర్కొన్నారు. నాడు ఎన్టీఆర్, నేడు చంద్రబాబునాయుడు పేదల కోసం అనేక పథకాలకు శ్రీకారం చుట్టారని, అందులో భాగంగానే అన్న క్యాంటీన్లు అన్నారు. గురువారం పులివెందుల పట్టణం నాలుగు రోడ్ల కూడలి వద్ద అన్న క్యాంటిన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల ఆకలితో బాధపడకూడదనే సంకల్పంతో టీడీపీ వ్యవస్థాపకుడు, స్వర్గీయ నందమూరి తారకరామారావు రూ.2కే కిలో బియ్యం పథకం ప్రారంభించారన్నారు. ఆయన స్ఫూర్తితోనే సీఎం చంద్రబాబు అన్న క్యాంటిన్ ఏర్పాటు చేసి పేదల ఆకలి తీరుస్తున్నారన్నారు. 2014 నుంచి 2019 వరకు రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 195 అన్న క్యాంటిన్లు కొనసాగించామని, అయితే ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ వాటిని దుర్మార్గంగా తొలగించి పేదల కడుపు కొట్టారని విమర్శించారు. ఐదేళ్ల పరిపాలనలో టీడీపీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను తొలగించి జగన్ పేర్లతో పథకాలు పెట్టుకున్నారన్నారు. అంతేకాకుండా పోలీసులను అడ్డుపెట్టుకుని టీడీపీ వారిపై కేసులు, దాడులు, దౌర్జన్యాలతో పాలించారన్నారు. త్వరలో మరొక అన్న క్యాంటిన్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. జగన్ అధికారంలో ఉండగా పులివెందుల ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ప్రతి పథకాన్ని పులివెందుల ప్రజలకు అందించేలా కృషి చేస్తామన్నారు. అన్నక్యాంటిన్ పనులను రాష్ట్ర కార్యదర్శి తూగుట్ల మధుసూదనరెడ్డి వేగవంతంగా చేయించారన్నారు. రూ.5కే నాణ్యమైన టిఫిన్, భోజనాలు అందించడం సంతోషమన్నారు. పేదలతో పాటు వివిధ పనుల నిమిత్తం పులివెందులకు వచ్చే వారికి అన్న క్యాంటిన్లు ఎంతగానో ఉపయోగన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు, కార్మికులకు రూ.5కే ఆకలి తీరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి తూగుట్ల మధుసూదనరెడ్డి, జోగిరెడ్డి, మహబూబ్‌బాషా, ప్రసాదరెడ్డి, వి.భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనరు రాముడు, సీఐ జీవన్‌గంగానాద్, బాబు, తూగుట్ల సిద్దారెడ్డి తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న రామగోపాల్‌రెడ్డి, బీటెక్ రవి

కడప నగరంలో నేడు అన్న క్యాంటిన్ల ప్రారంభం

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 19 : కడప నగరంలో శుక్రవారం అన్నక్యాంటిన్లను ప్రారంభిస్తున్నట్లు కమిషనరు వైవో నందన్ తెలిపారు. శుక్రవారం ఉదయం 12.30గంటలకు కడప ఎమ్మెల్యే మాధవీ క్యాంటిన్లను ప్రారంభిస్తారన్నారు. మొదటగా జడ్పీ కార్యాలయం ఆవరణంలో ఉన్న అన్నక్యాంటిన్లను ప్రారంభించి తరువాత పాత బస్టాండు, మున్సిపల్ కార్పొరేషన్ సమీపంలో గల క్యాంటిన్లను ప్రారంభిస్తారని తెలిపారు.

రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు

- టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథిరెడ్డి

వేముల, సెప్టెంబరు 19: యురేనియం టెయిలింగ్ పాండ్ నిర్వహణ లోపంతో నష్టపోయిన రైతులకు న్యాయం జరిగేంత వరకు పోరాడుతామని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథిరెడ్డి అన్నారు. గత సోమవారం యురేనియం కర్మాగారం నుంచి వ్యర్థాలను టెయిలింగ్ పాండ్‌కు తరలించే పైప్‌లైన్ లీకేజీ అయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం పొలంలోని కెమికల్ వ్యర్థాలను ఎలాగైనా రెవెన్యూ, పోలీసుల సహకారంతో తొలగించాలని చూస్తున్నారని సమాచారం తెలుసుకున్న కేకే కొట్టాల గ్రామస్థులు అక్కడికి చేరుకున్నారు. మబ్బుచింతలపల్లె మాజీ సర్పంచు శ్రీనాథ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారధిరెడ్డికి తెలిపారు. ఆయన పైప్‌లైన్ లీకేజీ ప్రాంతానికి వచ్చి మాట్లాడుతూ టెయిలింగ్ పాండ్‌నుంచి వస్తున్న దుమ్ము ధూళితో కేకే కొట్టాల ప్రజలు చర్మ, శ్వాస సంబంధిత వ్యాధుల తో బాధపడుతున్నారన్నారు. టెయిలింగ్ పాండ్ వల్ల వ్యవసాయ బోర్లలో నీరు కలుషితం కావడంతో కొట్టాలు ప్రాంతమంతా బీడు ప్రాంతంగా మారిందన్నారు. వ్యర్థాలను తరలించే పైపులు నిత్యం లీకేజీ కావడం అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట అన్నారు. తక్షణం పైపు లీకేజీ వల్ల కెమికల్ బురద వెళ్లిన వ్యవసాయ పొలాలను యురేనియం అధికారులు స్వాధీనం చేసుకొని ఆ రైతులకు న్యాయం చేయాలన్నారు. లేకుంటే పోరాటం తప్పదని అధికారులను హెచ్చరించారు.



పైప్‌లైన్ లీకేజీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పార్థసారధి రెడ్డి

ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటాం

- వన్‌టౌన్ సీఐగా బాధ్యతలు చేపట్టిన రామక్రిష్ణ



మాట్లాడుతున్న సీఐ రామక్రిష్ణ

కడప (క్రైం), సెప్టెంబరు 19 : ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ శాంతిభద్రతలను పరిరక్షిస్తామని కడప వన్‌టౌన్ సీఐ బి.రామక్రిష్ణ అన్నారు. గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ మట్కా, గంజాయి, జూదం బెట్టింగ్ లాంటి వాటిపై నిఘా ఉంచుతామని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాటి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. రౌడీలు, అనుమానితులపై నిరంతరం నిఘా కొనసాగుతుందని, రాత్రి సమయం లో పెట్రోలింగ్ నిర్వహిస్తామన్నారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిస్తే త మకు సమాచారం అందిస్తే పూర్తి స్థాయిలో కట్టడి చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతిరోజూ సాయంత్రం మైనర్ డ్రైవింగ్‌లపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. నంద్యాల జిల్లాకు చెందిన ఈయన 2004 బ్యాచ్ చెందిన వారు. ఎస్ఐగా కడప జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించారు. సీఐగా పదోన్నతి పొంది కర్నూలు, కడపలో పనిచేస్తూ ప్రస్తుతం కర్నూలు నుంచి కడప వన్‌టౌన్‌కు బదిలీపై వచ్చారు.

గ్రాడ్యుయేషన్ విజయవంతంగా పూర్తి చేయండి

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 19: గ్రాడ్యుయేషన్ విజయవంతంగా పూర్తి చేయాలని, ఇందుకుగాను ప్రతి విద్యార్థి మూడు ఇంటర్న్‌షిప్‌లను తప్పనిసరిగా చేయాలని గణిత విభాగాధిపతి డాక్టర్ గుర్విరెడ్డి తెలిపారు. గురువారం కడప నగరం ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాలను ఇంటర్న్‌షిప్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థి విధిగా చేపట్టవలసిన మూడు రకాల ఎంట్రెన్స్‌షిప్‌లు ఉన్నాయన్నారు. మొదటి సంవత్సరం పూర్తయిన తరువాత వేసవి సెలవల్లో కమ్యూనిటీ సర్వీసు ప్రాజెక్ట్, రెండో సంవత్సరం పూర్తయిన తరువాత పార్ట్‌టర్మ్ ఇంటర్న్‌షిప్, లాంగ్‌టర్మ్ ఇంటర్న్‌షిప్, అలాగే మూడో సంవత్సరంలో 5,6 సెమిస్టర్లను పూర్తిచేయాలన్నారు. మూడు ఇంటర్న్‌షిప్‌లలో మొత్తం 20 క్రెడిట్స్ ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో షిప్ కో ఆర్డినేటర్లు డాక్టర్ ప్రకాశ్‌నారాయణరెడ్డి, కుమార్, ఎకనామిక్స్ అధ్యాపకులు గురుమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

పత్రికల్లో వ్యవహార భాషను ప్రవేశపెట్టిన 'తాపీ'

- ఆచార్య మూలమల్లిఖార్జునరెడ్డి

కడప (నాగరాజుపేట), సెప్టెంబరు 19 : దిన, వార, పక్ష మాసపత్రిల్లో తొలిసారిగా వ్యవహారిక భాషను ప్రవేశపెట్టిన గౌరవం తాపీ ధర్మారావుకే దక్కుతుందని జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లిఖార్జునరెడ్డి తెలిపారు. గురువారం కడప రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం వారు తాపీ ధర్మారావు 138వ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రముఖ అవధాని మాడుగల శివశ్రీ శర్మ, కల్లూరు బాలయల్లారెడ్డి మాట్లాడారు.

వైవీయూ అవినీతిపై సీఐడీ విచారణ జరిపించాలి

- టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిరుమలేష్



మాట్లాడుతున్న తిరుమలేష్

కడప (మారుతీనగర్), సెప్టెంబరు 19: గత 5 సంవత్సరాల జగన్‌రెడ్డి పాలనలో వైవీయూలో ఇష్టానుసారంగా జరిగిన అక్రమ నియామకాలపై సీఐడీ విచారణ జ రిపించాలని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేష్ ప్రభుత్వాన్ని కోరా రు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ అభిమానులను వైవీయూలో వీసీ రిజిస్ట్రార్లుగా నియమించుకుని అవినీతి, అక్రమాలు, అనైతిక కార్యక్రమాలు విచ్చలవిడిగా పాల్పడి యూనివర్సిటీని భ్రష్టుపట్టించారని ఆరోపించారు. ప్రభుత్వం త్వరితగతిన స్పందించి నిజానిజాలను నిగ్గు తేల్చాలన్నారు. టీఎన్ఎస్ఎఫ్ నాయకులు భరత్‌సింహా, అమృత్, ఫరీద్, అరవింద్, అక్షయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

గత వీసీ, రిజిస్ట్రార్లపై చర్యలు తీసుకోవాలి: పీడీఎస్‌యూ

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 19: వైవీయూ, డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ యూనివర్సిటీల్లో గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిపై అప్పటి వైస్‌చాన్సలర్, రిజిస్ట్రార్లపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న డిమాండ్ చేశారు. గురువారం కడప నగరం పీడీఎస్‌యూ రాయలసీమ ప్రాంతీయ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ గత వైసీపీ ఐదు సంవత్సరాల పాలనలో అవినీతికి పాల్పడిన ప్రొఫెసరు వీసీ సురేంద్రనాథరెడ్డి, మాజీ వైస్ చాన్సలర్ సూర్యకళావతి, మాజీ రిజిస్ట్రారు వెంకటసుబ్బయ్య, విజయరాఘవ ప్రసాద్‌లు అవుట్‌సోర్సింగ్ ఎటువంటి నోటిఫికేషన్, రోస్టరు పద్ధతి లేకుండా అవుట్‌సోర్సింగ్ నియామకాలు చేపట్టారన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలన్నారు.

వైవీయూ అక్రమార్కులపై కేసులు నమోదు చేయాలి: సీపీఐ

కడప (సెవెన్‌రోడ్స్), సెప్టెంబరు 19 : వైవీయూను వైసీపీ కేంద్రంగా మార్చుకుని అక్రమ నియామకాలు చేపట్టారని, దీనిపై సీబీఐ విచారణ చేపట్టి అక్రమార్కులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ కార్యాలయంలో చంద్ర విలేకరులతో మాట్లాడుతూ 2019 నుంచి 2024 మధ్య 191 నాన్‌టీచింగ్ ఉద్యోగాలు అక్రమంగా నియమించారన్నారు. నిబంధనలు పాటించకుండా అక్రమంగా నియామకాలు చేపట్టి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు.

ట్రిపుల్‌ఐటీ విద్యార్థులకు పవర్‌లిఫ్టింగ్‌లో పతకాలు

వేంపల్లె, సెప్టెంబరు 19: ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో చదువుతున్న విద్యార్థులు అమలాపురంలో జరిగిన పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ కనబరచి పతకాలు సాధించారు. ఈనెల 14,15 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ 11వ పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలు ఈనెల 14,15 తేదీల్లో అమలాపురంలో జరిగాయి. సబ్‌జూనియర్ గర్ల్స్ విభాగం చాంపియన్‌గా నిలిచింది. సబ్‌జూనియర్ బాయ్స్ ద్వితీయస్థానంలో నిలిచారు. 8 బంగారు పతకాలు, 7 సిల్వర్ పతకాలు, ఒక బ్రౌంజ్ మెడల్ సాధించినట్లు కోచ్ తివారి తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థినీ విద్యార్థులను డైరెక్టర్ కుమారస్వామి గుప్త, ఏఓ రవికుమార్, పీడీలు శంషాద్‌బేగం, ఓబయ్య అభినందించారు.

పంట కోత ప్రయోగం ద్వారా దిగుబడి అంచనా: ఏఓ

లింగాల, సెప్టెంబరు 18: పంట కోత ప్రయోగం ఆధారంగానే దిగుబడిని అంచనా వేస్తామని ఏఓ రమేష్ అన్నారు. గురువారం లింగాల రైతు సేవ కేంద్రంలో పంట కోత ప్రయోగంపై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. మండలానికి 400 ప్యాకెట్ల పొద్దు తిరుగుడు మినీ కిట్లు మంజూరైనట్లు తెలిపారు.

మీరాపురం గ్రామంలో పొలంబడి

కమలాపురం రూరల్, సెప్టెంబరు 19 : మండల పరిధిలోని మీరాపురం గ్రామంలో వరిలో పొలంబడి కార్యక్రమాన్ని ఏడీఏ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంటలో సుడిదోమ, ఆకు నల్లిని గుర్తించడం, వాటి నివారణ చర్యలు తెలిపారు. సుడిదోమ నివారణకు గాను పైమెట్రోజెమ్ 0.6గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

ఘన జీవామృతంతో భూమి సారవంతం

పులివెందుల రూరల్, సెప్టెంబరు 19: ప్రకృతి వ్యవసాయ పద్దతులను ఉపయోగించి తయారైన ఘన జీవామృతంతో పంటలు సాగుచేయడం వలన పంటలు ఆరోగ్యకరంగా ఉండడంతో పాటు భూమి సారవంతం అవుతుందని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ భాస్కర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని చంద్రగిరి గ్రామంలో ఘనజీవామృతం తయారు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పులివెందుల రూరల్, సెప్టెంబరు 18: పట్టణంలోని పలు ప్రాంతాలలో శుక్రవారం ఉదయం 8 నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈఈ జగదీశ్వర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ కళాశాల సబ్‌స్టేషన్ పరిధిలో ట్రీ కటింగ్ ఉన్నందున ఈ అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎస్‌జీఎఫ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

చక్రాయపేట, సెప్టెంబరు 19: మండలంలోని మహదేవపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎస్‌జీఎఫ్ మండలస్థాయి పోటీల్లో ప్రతిభ చూపారు. ఖోఖో, కబడ్డీలో ఉత్తమ ప్రతిభ చూపి నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు రవికుమార్, పీడీ ఓబులేసు తెలిపారు. విద్యావేత్త వెంకటప్రసాద్, గ్రామ టీడీపీ నాయకుడు రమేష్‌లు పీడీ అభినందించారు.

అన్నదానం పుణ్యకార్యం

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 19 : అన్నదానం పుణ్యకార్యమని కడప ఎంపీ అవినాష్‌రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా, మేయరు సురేశ్‌బాబు పేర్కొన్నారు. గురువారం మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా 30వ డివిజన్ ఎన్టీఆర్ సర్కిల్‌లో ఎస్ఆర్ఐ అన్సర్ ఆధ్వర్యంలో బార్కి అన్నదానం చేశారు.

'కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుంది'

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 19 : ప్రతి కార్యకర్తకు వైసీపీ అధిష్టానం అండగా ఉంటుందని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం కడప నగరం వైసీపీ జిల్లా కార్యాలయంలో కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు.ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, మేయరు సురేశ్‌బాబు, మాసీమబాబు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో ఇంటి నిర్మాణం

- ఆరుగురిపై కేసు నమోదు

కడప (క్రైం), సెప్టెంబరు 19: కడప నగరం వక్కలపేటలోని ప్రభుత్వ స్థలంలో అనుమతి లేకుండా ఇంటి నిర్మాణం చేపట్టారు. దీంతో ఆపేందుకు వెళ్లిన టౌన్‌ప్లానింగ్ అధికారులపై దురుసుగా ప్రవర్తించిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ నాగార్జున తెలిపారు. సీఐ వివరాల మేరకు.. వక్కలపేటకు చెందిన రామసుబ్బయ్య ప్రభుత్వ స్థలంలో గురువారం ఇంటి నిర్మాణం చేపట్టారు. టౌన్ ప్లానింగ్ సిబ్బంది దాన్ని అడ్డుకోవడంతో రామసుబ్బయ్య, అతని కుటుంబ సభ్యులు అధికారులపై దురుసుగా ప్రవర్తించారు. టౌన్ ప్లానింగ్ అధికారి ప్రవీణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

రాహుల్ గాంధీపై అనుచిత వాఖ్యలకు క్షమాపణ చెప్పాలి

- ఎస్పీకి విజయజ్యోతి ఫిర్యాదు

కడప(కలెక్టరేట్), సెప్టెంబరు 20: పార్లమెంటరీ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై అనుచిత వాఖ్యలు చేసిన బీజేపీ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు విజయజ్యోతి డిమాండ్ చేశారు. గురువారం కాంగ్రెస్ నగర అధ్యక్షుడు అఫ్జల్‌ఖాన్ ఆధ్వర్యంలో పాతరిమ్స్ అనుపత్రి వద్ద కాంగ్రెస్ శ్రేణులు నిరసన తెలిపాయి. అనంతరం రాహుల్ గాంధీపై అనుచిత వాఖ్యలు చేసిన బీజేపీ దాని మిత్ర పక్ష నేత, శివసేన ఎమ్మెల్యే సంజయ్ గైక్వాయిడ్‌పై కేసు నమోదు చేయాలని ఎస్పీ హర్షవర్ధన్ రాజుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి అలీఖాన్, పీసీసీ మాజీ నేత సత్తార్, ధ్రువకుమార్‌రెడ్డి, సీనియర్ నాయకుడు బండి జకరయ్య, పుల్లయ్య, హరిప్రసాద్, సుశీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

పులివెందుల రూరల్, సెప్టెంబరు 19: ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకొని అవకాశాలను అందిపుచ్చుకోవాలని పులివెందుల జేఎన్టీయూ ప్రిన్సిపాల్ ఇ.అరుణకాంతి విద్యార్థులకు సూచించారు. గురువారం కళాశాలలో మొదటి సంవత్సరం బీటెక్ విద్యార్థులకు, తల్లిదండ్రులకు సమావేశం నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి నూతన విద్యార్థులకు స్వాగతం పలికారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తెచ్చేలా చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.వి.సుబ్బారెడ్డి, అకడమిక్ సెక్షన్ డిప్యూటీ కంట్రోలర్లు డాక్టర్ హుస్సేన్ వలి, డాక్టర్ సాంబయ్య, ప్రొఫెసర్ సూర్యనారాయణరెడ్డి, ప్రొఫెసర్ శేషమహేశ్వరమ్మ, డాక్టర్ తాజ్ మెహబూబ్, డాక్టర్ రామేశ్వర్‌రెడ్డి, డాక్టర్ దామోదర్‌రెడ్డి, డాక్టర్ రాధాకృష్ణ, ఇతర బోధన, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోండి: సీఐ



ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో మాట్లాడుతూన్న సీఐ కృష్ణారెడ్డి

కడప (క్రైం), సెప్టెంబరు 19: విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో అత్యున్నత స్థాయికి ఎదిగేలా భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని కడప మహిళా పోలీస్ స్టేషన్ సీఐ క్రిష్ణారెడ్డి విద్యార్థులకు సూచించారు. గురువారం కడప నగరంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే మంచి పౌరులుగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ ట్రాఫికింగ్ సీఐ రాజు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల బదిలీలు

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 19 : కడప మున్సిపల్ కార్పొరేషన్‌లో శుక్రవారం అర్బన్ సచివాలయ ఉద్యోగుల బదిలీ కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ వైఓ నందన్ మాట్లాడుతూ మ్యూచువల్ వేకెన్సీ బదిలీల ప్రక్రియను కడప అర్బన్ కమిషనర్లు సచివాలయ హోదాల ప్రకారం కౌన్సెలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారన్నారు. కార్పొరేషన్ సిబ్బంది సపోర్టింగ్ స్టాఫ్ సహాయంతో వెరిఫికేషను కూడా సజావుగా జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనరు వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ప్రజా పాలనకు వంద రోజులు పూర్తి

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 19 :ప్రజలు కోరుకున్న పాలన వచ్చి వంద రోజులు అయిందని, ఈ వంద రోజుల్లో ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారని టీడీపీ నగర అధ్యక్షుడు శివకొండారెడ్డి అన్నారు. గురువారం కడప నగరం శారదా నిలయం స్కూలు సమీపంలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రజలు, నాయకులు, కార్యకర్తలు ఎన్నో ఇబ్బందులకు గురయ్యారని కూటమి ప్రభుత్వం రావడంతో ఆనందంతో ఉన్నారన్నారు. వైసీపీ కనుమరుగయ్యేరోజులు అతి దగ్గరలోనే ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రవిశంకర్‌రెడ్డి, శ్రీధర్, సంపత్, ఖాసిం, జైకుమార్, అంజి పాల్గొన్నారు.

గొర్రెల పెంపకంపై అవగాహన పెంచుకోవాలి

సీకేదిన్నె, సెప్టెంబరు 19: రైతులు గొర్రెలు, మేకల పెంపకంపై అవగాహన పెంచుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయ కర్త డాక్టర్ వీరయ్య తెలిపారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో గురువారం వ్యవసాయంలో గ్రామీణ యువతను ఆకర్షించడం, నిలుపుకోవడంలో భాగంగా శాస్త్రీయ పద్ధతుల్లో గొర్రెలు, మేకల పెంపకంపై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు.

'విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి కారణమైన కళాశాలపై చర్యలు తీసుకోవాలి'

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 19 : విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి కారణమైన కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి డిమాండ్ చేశారు. గురువారం రిమ్స్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థిని పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ కార్పొరేట్ కళాశాల్లో ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయన్నారు. విద్యార్థులపై వత్తిడి చేయడమేనని ఇందుకు కారణమన్నారు.

విద్యార్థులను వేధించడం సరికాదు: ఏఐఎస్‌బీ

విద్యార్థులను వేధింపులకు గురి చేయడం వల్లే ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్నారని, విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌బీ జిల్లా కన్వీనరు సగిలి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. గురువారం ఆర్ఐవోకు వినతిపత్రం అందించి అనంతరం రిమ్స్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థిని పరామర్శించారు.

సమష్టి కృషితో కడప నగరాన్ని అందంగా తీర్చిదిద్దుతాం

- కార్పొరేషన్ కమిషనరు వైఓ నందన్

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 19 : కడప నగరాన్ని అందంగా తీర్చిదిద్దుదాం అని కార్పొరేషన్ కమిషనరు వైఓ నందన్ పిలుపునిచ్చారు. గురువారం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా కడప కార్పొరేషన్ కార్యాలయం మున్సిపల్ హైస్కూలు మెయిన్‌లో స్వచ్ఛ తాహిసేవ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కమిషనరు మాట్లాడుతూ ఉద్యోగులందరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు, కమలాపురం, యర్రగుంట్ల కమిషనర్‌లు, కడప అడిషనల్ కమిషనరు రాకేశ్‌చంద్రన్, ఏఈ నారాయణస్వామి, డీఈ ధనలక్ష్మి, సిటిప్లానర్ సూరజ్, ఎంహెచ్‌ఓ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.





ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ కమిషనర్, అధికారులు... ప్రతిజ్ఞ చేస్తున్న వైస్‌చాన్సలర్ క్రిష్ణారెడ్డి

ప్లాస్టిక్ భూతాన్ని తొలగిద్దాం

సమాజానికి పర్యావరణానికి ప్లాస్టిక్ ఒక భూతంలా మారిందని, దాన్ని నివారించకుంటే అనేక దుష్ప్రభావాలు ఎదుర్కోవలసి వస్తుందని వైస్‌చాన్సలర్ క్రిష్ణారెడ్డి అన్నారు. గురువారం స్వచ్ఛ తాహి సేవ కార్యక్రమంలో భాగంగా వైవీయూ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతగా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలన్నారు. అనంతరం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటరు ఎన్.వెంకట్రామిరెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ పద్మ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పీవీలు ప్రొఫెసరు అనిత, శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ లలిత, సుమిత, ఎ.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ స్వచ్ఛత పాటించాలి

సీకేదిన్నె, సెప్టెంబరు 19:ప్రతి ఒక్కరు స్వచ్ఛతను పాటించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త వీరయ్య తెలిపారు. స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం స్వచ్ఛతా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛత ప్రతి ఒక్క పౌరుడి బాధ్యత అని, ఇంటి పరిసరాలతో పాటు సామాజిక పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుని ఆరోగ్యంకోసం ప్రతి ఒక్కరు పాటుపడాలన్నారు. అదే విధంగా ప్రతి ఒక్కరు చెట్లను పెంచడం ద్వారా వాతావరణ కాలుష్యాన్ని, వాతావరణ మార్పులను తగ్గించే క్రమంలో తమవంతు పాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సురేష్, మానస పాల్గొన్నారు.

'పరిశుభ్రతే స్వచ్ఛతాహి సేవ లక్ష్యం'

గోపవరం, సెప్టెంబరు 19: పరిశుభ్రత, పరిరక్షణ స్వచ్ఛతాహి సేవ ప్రధాన లక్ష్యమని మండలంలోని రాచాయిపేట గ్రామ కార్యదర్శి నిఖిత అన్నారు. మూడోరోజు స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రత్యేక అధికారి ఎంఈవో చెన్నయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. ఇప్పటికీ పలు గ్రామాల్లో పరిశుభ్రత పరిరక్షణ విషయంపై పలు కార్యక్రమాలను చేపట్టామని, ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో ఆ గ్రామ సర్పంచ్ నాగదాసరి నాగేంద్ర ప్రజలు పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్లు పేదలకు వరం

● ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి




అన్నా క్యాంటీన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, భూపేశ్‌రెడ్డి, టీడీపీ యువనేత రితేష్‌కుమార్‌రెడ్డిలు

జమ్మలమడుగు, సెప్టెంబరు 19: అన్నా క్యాంటీన్లు ఏర్పాటు పేదలకు ఒక వరమని, ధరలు పెరిగినా సీఎం చంద్రబాబునాయుడు రూ.5కే మళ్లీ ప్రారంభించారని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. గురువారం రాత్రి ఎమ్మెల్యే అన్నా క్యాంటీన్ రిబ్బన్ కట్ చేసి పునఃప్రారంభించారు. అనంతరం ఆవరణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పట్టుబట్టి రాష్ట్రం ఇబ్బందుల్లో ఉన్నప్పటికి అభివృద్ధిపై ముందుకెళ్లడం సంతోషకరమన్నారు. అందులో భాగంగా జమ్మలమడుగు నియోజకవర్గంలో జమ్మలమడుగు- ఎర్రగుంట్ల అన్ని గ్రామీణ ప్రాంతాల్లో కరెంటు ఎక్కడా కోతలు లేకుండా రోడ్ల రిపేరు, ఆస్పత్రి అభివృద్ధి తదితరవన్నీ చేస్తున్నామన్నారు. వంద రోజుల పాలనలో తాను చెప్పిన విధంగా చెప్పినట్లుగా పనులు ప్రారంభించామన్నారు. రూ.300 కోట్లు రోడ్ల రిపేరు కోసం రిలీజ్ చేశారన్నారు. ఇక జమ్మలమడుగుకు కన్యతీర్థంలోనే స్టీల్‌ప్లాంట్, పది వేల మెగావాట్లతో సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ రాబోతోందన్నారు. అలాగే దాల్మియా ఎక్స్‌టెన్షన్, అదాని స్టీల్‌ప్లాంట్ వస్తున్నాయని తెలిపారు. నియోజకవర్గంలో డ్రైనేజీపై గ్రామాల్లో అభివృద్ధి పనులు ప్రారంభించామన్నారు. గత ఆరు సంవత్సరాల క్రితం ఇదే ప్రాంతంలో అక్టోబరు 2న అన్నా క్యాంటీన్ ప్రారంభం జరిగిందని, జగన్ వచ్చిన తర్వాత పేదలకు అన్నం పెట్టకుండా తీసివేశాడని, అందుకే ఆ దరిద్రం పోయిందన్నారు. టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం తిరిగి అన్నా క్యాంటీన్‌ను ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. వంద రోజుల పాలనలో సీఎం అభివృద్ధిపై దృష్టి పెట్టారన్నారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం మంచి చేస్తోందన్నారు. అనంతరం భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ శివమ్మ, కమిషనర్ ప్రమోద్‌కుమార్, వారి సిబ్బంది, మెప్మా సిబ్బంది, మున్సిపల్ వైస్‌చైర్మన్ పోరెడ్డి రామలక్షుమ్మ, టీడీపీ మండల అధ్యక్షుడు సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, పట్టణ నేత పురుషోత్తంరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, కౌన్సిలర్ బానా శివరామలింగారెడ్డి, పోలీసు లక్ష్మిదేవి, చంద్ర, ఇతర అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బద్వేలుటౌన్: పేదప్రజల ఆకలిని తీర్చేందుకు సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన అన్నా క్యాంటీన్లు ఒక వరమని టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త రితీష్ కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లా ఆవరణలో అన్నా క్యాంటీన్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జ రోశన్నతో కలిసి మాట్లాడుతూ నిత్యావసర ధరలు పెరిగి అధికంగా ఉన్న సమయంలో కూడా రూ.5కే భోజనం అందించడం సంతోషకరమన్నారు. అనంతరం స్వయంగా రితీష్‌కుమార్‌రెడ్డి నిరుపేదలకు భోజనం వడ్డించి, కూటమి నాయకులతో కలిసి అక్కడే భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటనరసింహారెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి, పోరుమామిళ్ల సర్పంచ్ యనమల సుధాకర్, రాగిమాను ప్రతాప్‌కుమార్, మిత్తికాయల రమణ, సునీత, బిగ్‌బాస్, జహంగీర్‌బాషా, నరసింహనాయుడు, మస్తాన్‌బాబు, సీనియర్ న్యాయవాది పీవీఎన్ ప్రసాద్, నాగభూషణం, రామక్రిష్ణ, బొమ్మన విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

మండల స్థాయి అథ్లెటిక్ పోటీలు

ముద్దనూరు, సెప్టెంబరు 19: స్థానిక బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈ నెల 21, 23వ తేదీల్లో మండల స్థాయి అథ్లెటిక్ పోటీలు జరుగనున్నట్లు ప్రధానోపాధ్యాయుడు రాజబాబు తెలిపారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులు స్టడీ సర్టిఫికెట్‌తో క్రీడల్లో పాల్గొనాలన్నారు. అండర్-14లో పాల్గొను క్రీడాకారులు 01-01-2011 తరువాత, అండర్-17లో పాల్గొనే క్రీడాకారులు 01-01-2008 తరువాత జనన ధ్రువీకరణ ఉండాలన్నారు. 21వ తేదీన ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్, యోగ, చెస్ 23వ తేదీన అథ్లెటిక్ జరుగుతాయని తెలిపారు.

అక్రమ కట్టడాలను తొలగించాలి : ఎంఆర్‌పీఎస్

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 19: ప్రొద్దుటూరులో ప్రభుత్వ స్థలాలు, మున్సిపల్ స్థలాలు ఆక్రమించి నిర్మించిన దేవాలయాలు, మసీదులు, చర్చిలు తొలగించాలని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ప్రతినిధి సుధాకర్ మాదిగ డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డిని కలిసి వారు వినతిపత్రం అందజేశారు. కేవలం పెద్దమ్మ గుడిని మాత్రమే తొలగించమని నోటీసులు ఇవ్వడం సబబు కాదని, దీనిపై పునరాలోచించాలని కమిషనర్‌కు తెలియజేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కేజీబీవీ విద్యార్థులు

అట్లూరు, సెప్టెంబరు 19: అట్లూరు మండలంలోని కేజీబీవీ విద్యార్థులు తొమ్మిది మంది రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు కేజీబీవీ ప్రత్యేక అధికారి ఫణిశ్రీ గురువారం తెలిపారు. అండర్-19 జిల్లాస్థాయి క్రీడా పోటీలు మంగళవారం జరిగాయి. ఈ పోటీల్లో జోడో, కుస్తీ క్రీడలకు సునీత, అమృత, మస్తాన్‌బీ, చైతన్య లక్ష్మి, రుషీస్సీ, ప్రవళ్లిక, శిరీషా, అమృత అనే తొమ్మిది మంది విద్యార్థులు ప్రతిభ చూపి రాష్ట్ర క్రీడలకు ఎంపికయ్యారు. వీరి ఎంపికపై ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

అండర్-14, 17 బాలబాలికలకు క్రీడా ఎంపికలు

జమ్మలమడుగు, సెప్టెంబరు 19: జమ్మలమడుగు మండలానికి సంబంధించి ఎస్‌జీఎఫ్‌ఐ అండర్-14, 17 బాలబాలికలకు గురువారం జమ్మలమడుగు పీఆర్ ఉన్నత పాఠశాల మైదానంలో యోగా, చెస్, బ్యాడ్మింటన్, క్యారమ్ పోటీల ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రొద్దుటూరు డివిజన్ డిప్యూటీ ఎడ్యుకేషనల్ అధికారి క్రిష్ణప్ప మాట్లాడారు. విద్యార్థులు క్రీడలతో పాటు చదువు ఇష్టపడి బాగా చదువుకుని మంచి మార్కులు సాధించాలన్నారు. ఎంఈవో-2 చంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ ఈ క్రీడల్లో విజేతలైన క్రీడాకారులు త్వరలో జరగబోవు నియోజకవర్గ క్రీడల్లో పాల్గొంటారని తెలిపారు. సుమారు అన్ని పాఠశాలల నుంచి 150 మంది విద్యార్థులు ఈ క్రీడల్లో పాల్గొని విజయవంతం చేసినందుకు ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ జ్యోతి, ఉపాధ్యాయులు మురళి, తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ సిబ్బంది నిరసనకు డాక్టర్ల మద్దతు

జమ్మలమడుగు, సెప్టెంబరు 19: కాంట్రాక్టు స్టాఫ్ నర్సులందరిని రెగ్యులర్ చేయాలని జమ్మలమడుగులో గురువారం నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట కాంట్రాక్టు స్టాఫ్‌నర్సు సిబ్బంది నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని ఆస్పత్రి సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. కడప జిల్లా ఏపీఎన్‌ఎస్‌సీ పిలుపు మేరకు జమ్మలమడుగులో కాంట్రాక్టు స్టాఫ్ నర్సులందరిని రెగ్యులర్ చేయాలని నిరసన వ్యక్తం చేశారు. నర్సింగ్ అధికారుల హక్కులను కాపాడాలని, జీవోనెం.115ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జమ్మలమడుగులోని కాంట్రాక్టు నర్సింగ్ సిబ్బంది, డాక్టర్లు పాల్గొన్నారు.

'ఆక్రమణలను స్వాధీనం చేసుకోవాలి'

బద్వేలు, సెప్టెంబరు 19: చెన్నంపల్లె, సి.కొత్తపల్లె భూములను సర్వే నెంబర్ల వారీగా విచారణ చేపట్టి ఆక్రమిత భూములను స్వాధీనం చేసుకోవాలని గ్రేటర్ రాయలసీమ అభివృద్ధి ఫోరం ఆధ్వర్యంలో గురువారం తహశీల్దారు ఉదయభాస్కర్‌రాజుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆ సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడారు. ప్రభుత్వ భూముల కంచెలను తొలగించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. నియోజకవర్గ కార్యదర్శి జకరయ్య, నాయకులు చంద్రమోహన్‌రాజు, రామరాజు, బాబు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పెట్రోలు బంకు ప్రారంభం

బద్వేలుటౌన్, సెప్టెంబరు 19: స్థానిక మైదుకూరు రోడ్డులోని మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెచ్‌పీసీఎల్ పెట్రోలుబంకును గురువారం టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త రితీష్‌కుమార్‌రెడ్డి, బొజ్జరోశన్న, మున్సిపల్ కమిషనర్ వెంకటనరసింహారెడ్డిలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యనమల సుధాకర్, పెట్రోలు బంకు మేనేజర్ మన్మథరావు, కూటమి నేతలు వెంగల్‌రెడ్డి, ప్రతాప్ కుమార్, సూర్యనారాయణరెడ్డి, సుబ్బారెడ్డి, వెంకటయ్య, మురళీ, సునీత, భూపాల్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, రమణ, రామక్రిష్ణ పాల్గొన్నారు.

వీఆర్‌ఏ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా హరిక్రిష్ణ



బద్వేలు, సెప్టెంబర్ 19: ఏపీ వీఆర్‌ఏ వెల్ఫేర్ అండ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా గుర్రాల హరిక్రిష్ణ రాయల్‌ను ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు నల్లిపోగు నాగేశం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో ఆయన సేవలు విస్తరించి వీఆర్‌ఏలకు అండగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈశ్వరయ్య, కార్యదర్శి కోడూరు పుల్లయ్య, ఉపాధ్యక్షుడు బొట్ల నాగ సుబ్బయ్య యాదవ్, షేక్ బాష, బాణాల శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

30 మద్యం బాటిళ్లు స్వాధీనం

రాజుపాలెం, సెప్టెంబరు 19: మండల పరిధిలోని కొర్రపాడు గ్రామంలో 30 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ కత్తి వెంకటరమణ తెలిపారు. సుబ్బరాయుడు అనే వ్యక్తి మద్యం అక్రమంగా అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో గురువారం నిఘా ఉంచి మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని సీజ్ చేశామన్నారు.

సెమిస్టర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రొద్దుటూరుటౌన్, సెప్టెంబరు 19: జేఎన్‌టీయూఏ బీటెక్ తృతీయ సంవత్సరం రెండవ సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో సాయిరాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపల్ పాండురంగన్ రవి తెలిపారు. సివిల్ విభాగంలో పవన్‌కుమార్‌రెడ్డి 87.22, వసంత 85.22, చంద్రిక 82.20 మార్కులు సాధించారు. ఈఈఈలో గురుసుప్రియ 89.56, లిఖిత 89.44, సుమంత్ 89.22, ఈసీఈలో సునీత 87, ప్రవీణ 86.67, గాయత్రిదేవి 87.11, సీఎస్‌ఈలో మహేశ్వరి 86.78, షేక్ మహమ్మద్ సాహిల్ 84, సాయిశైలజ 83.67 శాతం మార్కులు సాధించారు.

పరిశుభ్రతపై అవగాహన ఉండాలి

బద్వేలు, సెప్టెంబరు 19: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఎస్‌బీవీఆర్ డిగ్రీ, పీజీ కళాశాలలో విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. గురువారం కళాశాల ఆవరణం నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కళాశాల ప్రిన్సిపాల్ వెంకటసుబ్బారెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ మూడు యూనిట్ల సమన్వయకర్తలు దొరస్వామినాయక్, ఈశ్వరయ్య, మహేష్, రవీంద్రారెడ్డి, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద పునఃప్రారంభం

ముద్దనూరు, సెప్టెంబరు 19: స్థానిక డీఎస్‌పల్లె సమీపంలో గత టీడీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పునఃప్రారంభించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. అందులో భాగంగా ఎంపీడీవో చంద్రమౌళీశ్వర్, ఈవోపీఆర్డీ వీరభద్రుడు గురువారం శిథిలావస్థలో ఉన్న కేంద్రాన్ని పరిశీలించారు. మండలంలో 18 చెత్త నుంచి సంపద కేంద్రాలు ఉన్నాయని, అక్టోబరు రెండవ తేదీకి 12 కేంద్రాలను పునఃప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు.

మినీ గోకులాలపై శిక్షణ తరగతులు

జమ్మలమడుగు, సెప్టెంబరు 19: పట్టణంలోని మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్యాలయంలో గురువారం మినీ గోకులాలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధి హామీ పథకానికి సంబంధించి క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కోర్సు డైరెక్టర్ హరి, ఏపీడీ రామలింగేశ్వరరెడ్డి, తదితరులు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, బేర్‌ఫుట్ టెక్నికల్ సిబ్బంది, అధికారులు ఆనంద్, క్వాలిటీ కంట్రోల్ అధికారులు విజయభాస్కర్, మధుసూదన్ పాల్గొన్నారు.

స్వచ్ఛతతోనే ఆరోగ్యం: కమిషనర్

జమ్మలమడుగు, సెప్టెంబరు 19: స్వచ్ఛతతోనే ఆరోగ్యమని జమ్మలమడుగు మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ సూచించారు. గురువారం జమ్మలమడుగు పట్టణంలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా ప్రధాన రోడ్డుకు పక్కన ముద్దనూరు రోడ్డు నందు తదితర ప్రాంతాల్లో చెత్త నిల్వలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ పాఠశాల విద్యార్థులచే స్వచ్ఛతకు సంబంధించి ప్రతిజ్ఞ చేయించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, మెప్మా సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఖాళీలకు దరఖాస్తుల ఆహ్వానం

జమ్మలమడుగు, సెప్టెంబరు 19: మహాత్మాజ్యోతిరావుపూలే సంక్షేమ గురుకుల పాఠశాల వనిపెంట నందు ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేయుటకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జమ్మలమడుగులోని జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాలల కన్వీనర్ ప్రిన్సిపల్ రామక్రిష్ణారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25 విద్యాసంవత్సరానికిగాను డెమో ద్వారా తాత్కాలిక ప్రాతిపదికన టీచర్స్‌ను భర్తీ చేయనున్నామన్నారు. ఆసక్తి కలిగిన మహిళా అభ్యర్థులు మాత్రమే కన్వీనర్ కార్యాలయం, జమ్మలమడుగులో నేరుగా ఈ నెల 21వ తేదీలోపు పంపాలని తెలిపారు. ఖాళీలు టీజీటీ ఇంగ్లీష్, టీజీటీ ఇంగ్లీష్-1, టీజీటీ సైన్స్-1, టీజీటీ సోషియల్-1 ఒకటి చొప్పున ఉన్నాయి.

చెకుముకి సైన్స్ సంబరాలు

బి.కోడూరు, సెప్టెంబరు 19: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబరాలు ఈ నెల 25న కస్తూర్బాగాంధీ పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ శ్రీలత తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు దేవదత్తం, జిల్లా ప్రధాన కార్యదర్శి బాల బయన్న, జిల్లా సీనియర్ నాయకులు శ్రీరాములు ఆధ్వర్యంలో సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం వాల్‌పోస్టరు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రతిభ, శైలజ, ప్రియదర్శిని, శశికళ, కల్పన, అరుణ పాల్గొన్నారు.

మండల ప్రత్యేక అధికారికి ఘన సన్మానం

బ్రహ్మంగారిమఠం, సెప్టెంబరు 19: మండల ప్రత్యేక అధికారిగా నరసింహారెడ్డి గత రెండు సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల కలెక్టర్ ఆదేశాల మేరకు కాశినాయన మండలానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా గురువారం ఎంపీపీ వీరనారాయణరెడ్డి అధ్యక్షతన ఎంపీడీవో వెంగమునిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నరసింహారెడ్డిని శాలువా పూలమాలలతో సన్మానించారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వెలుగుసిబ్బంది, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైనేజీ తొలగింపు : మండల కేంద్రంలోని ప్రధాన డ్రైనేజీ కాల్వలో వ్యర్థాలతో నిండిపోవడంతో దుర్వాసన వస్తోందని ప్రజలు ఇటీవల గ్రామసభలో ఎంపీడీవోకు వినతిపత్రం అందించారు. ఈ మేరకు గురువారం ఎంపీడీవో వెంగమునిరెడ్డి పర్యవేక్షణలో గ్రామపంచాయతీ సెక్రటరీ ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలో ఎక్సకవేటర్ సాయంతో డ్రైనేజీ కాల్వలోని మురుగును తొలగించారు.